Rau, N. C.

Asahanāraṇyanirmūlanakuṭhāramu

Ellore, 1898

Record no. 335

Rau, N. C.

అసహానారణ్యనిర్మూలనకుఠారము

Ellore, 1898

Record no. 335

Bibliographic Record Target

Rau, N. C.
అసహనారణ్యనిర్మూలనకుఠారము / edited by N. C. Rau.- Ellore : Manjuvani Press, 1898.
32 p. ;19 cm.
Record no. 335

Rau, N. C.
Asahanāraṇyanirmūlanakuṭhāramu / edited by N. C. Rau.- Ellore : Manjuvani Press, 1898.
32 p. ;19 cm.
Record no. 335

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB   Date filming began:

అసహనారణ్యనిర్మూలనకుఠారము.

PART I

EDITED BY

N.C.Rau.

I am nothing, if not critical,
Shakespeare.

A fool can find more faults than a wise man can mend.

Criticks now-a-days, like flocks of sheep
All follow, when the first has made the leap.
Southerne.

Ellore.

1898

1 anna — Manjuvani Press.

అసహనార్థ్యనిర్మూలనకుఠారము.

పీఠిక.

లోకములో సదసద్వివేకము, సమయోచితబుద్ధిగలుగుటయే కష్టము. కలిగినను గొన్నివేళల స్ఫురించుటదుర్లభము. భయప్రమాదాదులులేనివారలేరు. కానవయ్యవిషయివానికి భంగముగలిగించుటచే నెంతవారయినను స్ఖాలిత్యములఁ గలిగియేయుండురు. ఇఁకసామాన్యులమాటఁ జెప్పనేల? కానఁబ్రతిమనుజునకును నొరులవిమర్శనమునందు దృష్టినుంచుటయును నొరులబోధను వినుటయును బురోవృద్ధికిఁ గారణములు. కాఁబట్టి తన్నుగూర్చిచేయఁబడిన విమర్శనమందుగాని బోధయందుఁగాని తగిన యధిక్షేపణమున్నను నిందయున్ననుగూడ నాయావిమర్శకుఁడును బోధకుఁడునుదనకు మేలొనర్చినవారే యగుదురుగానఁ బ్రతినరుఁడును వారియందుఁగృతజ్ఞుఁడై యుండవలయును గాని యిదియంతయును సద్విమర్శక సబోధకులవిషయమైయున్నది. వీరుగాక లోకమున నింకనొకతరగతివారుకూడనున్నారు. వారలసద్విమర్శకులును నసద్బోధకులునైయున్నారు. ఈవిమర్శనములును బోధలును నల్పబుద్ధిజాతములని, దుర్బుద్ధి జాతములని రెండువిధములు. అల్పబుద్ధిజాతములఁజూచి జాలిఁజెందుటకన్న మఱొండు పనియవసరములేదు. దుర్బుద్ధిజాతము లుభయపక్షంబులవారికినిగూడ హానికరములు గాన వానియెడలఁదగినపని చేయుటయవసరము. విషమునున్నదియున్నట్లుగాఁదిననిచ్చువానికంటె దానినివెన్నలోఁబొదిగియుంచి వెన్నయనిచెప్పి యిచ్చువాఁడు వేయిమడుంగులెక్కుడు హానికరుఁడని యంగీకరింపనివారుండరుకదా. అట్లనేదుర్బోధనుసుబోధయనుపేరితో పొదిగిచెప్పువానిని గూడమతింత గొప్పశత్రునిగాఁజూడవలయును. ఆవిషయమునఁదగిన పనిచేయవలయునుగాన నీనడుమమామంజువాణివిషయమై సుబోధయనుమిషమీఁద శశిలేఖలోఁబడిన దుర్బోధకుఁదగిన సమాధానమిచ్చుట యనవసరమనువారుందురని తలంపము. శశిలేఖచేసినది సద్బుద్ధితోడఁజేసినదా దుర్బుద్ధితోడఁజేసినదాయనిన రెండవదియేయనినుడువలసియున్నది. ఏమన, మంచియూహతోఁ జేసినయెడల మంజువాణినిఁజక్కఁగాఁ జదివియవగాహనముజేసికొని వ్రాయుటతటస్థమగును. ఇటనట్లుజరుగలేదు. శశిలేఖ మంజువాణి వైద్యశాస్త్రమునుగూర్చి ముచ్చటించుచున్నట్లువ్రాసినది. ఇదికేవలమునుదప్పు. మంజువాణియందుఁగల వైద్యుతలోహశాస్త్రమను శబ్దమందలి "వైద్యు" అనునక్షరములఁజూచియీపాణ్యవశంబునగ్రంథమంతయును-జూడకయే యదివైద్యశాస్త్రవిషయమనుకొని దానివిమర్శింపఁజొచ్చిన

ది. మఱియునుమంజువాణియొక్క యుద్దేశమే తెలిసికొనలేదు. ఏమనమంజువాణి విద్యావిషయకమైన సంపుటిక (Magazine) అయియుండఁదాను వార్తాపత్రికాలక్షణములఁగూర్చి ముచ్చటింపఁజొచ్చినది. అదిగాక మంజువాణియందలి ప్రతి విషయమును విబుధులందఱునవసరవిషయములని నుడువుచుండు వ్యవసాయాదులగూర్చిన వ్యాసములుగూడ నవసరములేదనియు, వ్యవసాయమునుగూర్చిబోధయెందుకు? దున్నరాదాయని, వైద్యబోధయెందుకు? మందులీయరాదాయనియునసంగతప్రసంగముల మొదలుపెట్టినదిగాన నిదియీర్ష్యావశముగాకపోదు. ఇట్టిపిచ్చిమాటలకు సమాధానమవసరములేకపోయినను శశిలేఖకివితొలికూతలుగాన నించుకసమాధానమువ్రాయఁబడును. ముందిట్టివ్రాఁతలకు సమాధానములుండవు.

ఈశశిలేఖ తానితరదుర్బోధలకులోనై మంజువాణికి బోధలఁగఱపుదానివలె నసద్బోధలఁ జేయనారంభించుటయెగాక, తనతోసమానబోధకుఁడును సమానవిమర్శకుఁడునునగు నొకసత్యప్రియునిఁ జేరదీసికొని కవిరాజసందర్శన విమర్శనముఁజేయించి తానుదాని శిరసావహించి "పిస్సన్న చెప్పినది వేద" మనురీతిని నమ్మి యీరూరఁ జాటఁజొచ్చినది. శశిలేఖయు, సత్యప్రియుఁడునుచేసిన బోధయు, విమర్శనముఁ జూచి, పలువురుపండితులు పలువిధముల వ్రాసియుండుటచే వానినన్నిఁటి నేకముఖముగావించి ముద్రించి ప్రచురించుచున్నాఁడను.

N. C. R.

కవిరాజ సందర్శన విమర్శనము

" తిక్కనకుఁ దిక్కువిడిపించు తెలివికలఁడు. "

శశిలేఖను నిత్యంబును గరంబుల నలంకరించుకొని ప్రమోదభరితస్వాంతుల గుచున్న యోయాంధ్రమహాజనులారా! అపూర్వాలంకారములతోడ నొడలుసింగారించుకొని యాంధ్రదేశంబున శృంగారరసప్రవాహమును బ్రవహింపనుత్సహించెడు మంజువాణిని సందర్శించితిరా? అప్పత్రికారత్నమునకు " తిక్కనకుఁ దిక్కువిడిపించు తెలివికలఁడ " ట్టి కవిరాజుచేత సార్వభౌమత్వముఁ బడసి, శ్రీమదానందగజపతి క్షితిపతికన్న ఘనుండని పొగడ్తఁగన్న భుజంగసార్వభౌముండొడయండని తన్ముఖపత్రమున ముద్రింపఁబడిన విగ్రహమె చక్కఁగఁ జాటుచున్నదిగదా? తిక్కనకుఁ దిక్కువిడిపింపఁగల కవిరాజులును తత్కవిరాజులవలన సార్వభౌమత్వమునుబొందెడు రసికాగ్రగణ్యులును వెల్వడినప్పుడాంధ్ర భాషావధూటికి రాఁగల గౌరవము నేమనికొనియాడఁగలము? ఆహా! మన యాంధ్రదేశము సంపాదించిన

సౌభాగ్యము కలియుగంబున నిట్లు వికసింపకుండునా? చదువరులారా!

మంజువాణివెన్నంటివెడలిన కవిరాజసందర్శన లాభంబుఁ బడసితిరే? ఓహో! ఈకవిరాజులెవ్వరు? గద్వాలసంస్థానాస్థానకవులగు ప్రభాకరాఖ్య వరులఁట! వీరికవితాసామర్థ్యంబెట్టిదన.

" శృంగారరసమువ-ర్ణించినగాంగేయుఁ, డంబవెంబడినంగ-లార్చవలయు।
కరుణారసంబెత్తి-కలుఁగఁబోసినద్రోణి, పూనిదృష్టద్యుమ్నుఁ-బ్రోవవలయు।
వీరరసంబోలి-సాకింపవైరాటి, యొక్కఁడేకురుసేనఁ-జెక్కవలయు।
రౌద్రరసంబువ-ర్ణనసేయబలరాముఁ, డాసేనలోసివా-లాడవలయు।

గీ. నప్పయిటుఁజెప్ప నేర్చుప్ర-భాకరాఖ్య।
కవివరుఁడటన్న హేళన-కాదుసుండు।
కాలమొకరీతినున్నది-కాకయున్న।
దిక్కనకుఁదిక్కుపిడిపించు-తెలివికలఁడు॥

కాలమనుకూలముగలేదుగాని యీయపూర్వ కవిశ్రేష్ఠుండు తిక్కనకుఁబట్టిన పైత్యమును బోఁగొట్టఁగల తెలివిగలవాఁడఁట! ఇంతటి కవికులాగ్రగణ్యుఁడే యేమహాకావ్యములరచించి వాసిఁగాంచెనోయింతవఱకుఁ దెలియరాకున్నది. ఆత్మోత్కర్షతను బాటించువారి కవిత్వమెట్లుండునో లోకంబునకే విశదంబుకాని యందువలన లేశమాత్రమును గౌరవముగలుఁగఁబోదు. శ్రీమన్మంత్రిప్రగడ భుజంగరాయవిరచితమగు గానామృతమను నొకచిన్నపొత్తమును నిరుపయోగమయినదానిని నీప్రభాకరకవి " సరసార్థోచితదివ్యప్రౌఢతరవా-చామాధురీధుర్యమై । స్వరసాహిత్యములక్ష్మదరంగములఝం-ఝల్లీలనుప్పొంగుభా । సురసంగీతపయోబ్ధిలోతుఁగనియు-క్తుల్ మెచ్చఁగాఁద్రచ్చియ । క్షరగానామృతమిచ్చెభూమికిభుజం-గక్ష్మాధిపుండెంతయుఁ॥ అని పొగడియున్నాఁడు. గోరంతలు కొండంతలుచేసి వందిమాగధ స్తవంబులు వినిపించుట స్వదేశ సంస్థానాస్థానకవులకు నైసర్గికంబు కాఁబోలు?

" జీర్ణకావ్యములు-జీవింపఁగాఁజేయు, మంజువాణికిని-సమానమున్నె " యని యీకవిరాజు పలుకుచున్నాఁడు. జీర్ణకావ్యము లుజ్జీవింపఁజేయు చింతామణి, వైజయంతి, అముద్రితగ్రంథచింతామణి, పత్రికల మఱపించి మంజువాణి మోహముంగొలిపెఁగాఁబోలు! ఎంతటి పత్రికాధిపతులకైనను, ఎంతటి కవీశ్వరులకైనను, ఎంతటిరాజాధిరాజులకైనను, స్వోత్కర్షను బ్రకటించుకొనుచు పరుల నిరపరాధుల నిరసించుట శ్రేయోదాయకముకాదు. భుజంగరావుగారు తమ్ము 'నరనాథమౌళి, భుజంగసార్వభౌముఁడు, భుజంగాధీశుఁడు, భుజంగరాణ్మఘవుఁడు, అని ప్రభాకరకవి వర్ణించినందునఁ దామును వారికి 'కవిసార్వభౌమత్వము' నిప్పించిరి. తాము సార్వభౌములనుకొన్నను చక్రవర్తులనుకొన్నను నేమిగాని సుప్రసిద్ధాంధ్ర కవివరుల

చేత కవిబ్రహ్మయని పేరొందిన తిక్కన యంతటివానిని నిరసించుట మిక్కిలి శోచనీయము. తిక్కనకవి సయితము 'ఉభయకవిమిత్రుఁడ' ననిమాత్రమె చెప్పుకొనియున్నాఁడుగాని వీరలవలె స్వోత్కర్షను బ్రకటించుకొనియుండలేదు. కవులకైనను రాజులకైనను మానవులకైనను తమ గుణాగుణములు ప్రజలుచెప్పుకొనినప్పుడు వన్నెకెక్కును గాని తమంతటదాము బిరుదుపద్యములు చెప్పుకొన్నంతమాత్రముచేత లోకము పరిహసించునుగాని కొండొకగౌరవమీయఁబోదు.

వారుచెప్పుకొన్నటు లొండొరుల బొగడుకొనుట ప్రాక్తనపుణ్యవిశేషమె కాఁబోలు! పైనుదహరించినరీతి నొండొరులవర్ణించుకొన్న వర్ణనలు స్వభావవర్ణనలఁట. లోకమునకుమాత్రము పరిహాసాస్పదములగు వర్ణనలనుటకు లేశమాత్రము సందియము లేదు. వీని సత్యాసత్యములఁ జదువరులే నిర్ణయింతురుగాక. ఈప్రభాకర కవిగారు సరసముగఁ గవనము నేర్చినవారైనయెడల నిట్టివిరసమునకు బాల్పడరు. తమ కవితామాధుర్యమును లోకమునకు జవిచూపఁదలచినయెడల నేదైననొకమహాకావ్యమును రచింపరాదా? శ్రీభుజంగరావుగారి శారదానిలయమను పుస్తకభాండాగారమునందు వేదములను జూచియుండిరఁట. ఋగ్యజుస్సామాథర్వణంబులలో నేవేదంబును దామాపుస్తకభాండాగారమునఁ గాంచిరో యాంధ్రలోకమున కవినిచ్చినయెడల నిప్పుడా వేదములనుజదువుటకు సంసిద్ధుఁడనైయున్నాను. నాకట్టి భాగ్యమును లభింపఁజేయవలెనని వారినిమిక్కిలి వేడుచున్నాను. లేకున్న లోకంబునకు సత్యమయినసంగతులవెల్లడించక యతిశయోక్తిగా,

సీ. శ్రుతులు పురాణముల్ - స్మృతులు శాస్త్రంబులు, కావ్యంబులును నాట - కములు బాణ।
ములు ప్రబంధములు చెం - పువులు నిఘంటువుల్, శతకముల్ ద్విపదలు - చాటువులును।
వచనముల్ యక్షగా - నచయము రగడలు, దండకమ్ములు సామి - తులును మఱియు।
వేనవేల్గ్రంథమ్ము - ల్వెదకి తెప్పించి భం, డాగారమూరనం - దతికినుపచ।

గీ. రించునట్లుగ స్థాపించి - మించికీర్తి। నెగడుమతి నెవ్వరికిఁగల్గె - జగమునందు।
శ్రీమదానంద గజపతి - క్షితిపతికిని। ఘనుఁడగు భుజంగ సార్వభౌ - మునకుఁదక్క॥

అనియేలవర్ణింపవలెను? స్మృతులకును శాస్త్రంబులకును భేదమెద్ది? ప్రబంధములును నాటకములును కావ్యములు కావా? కావ్యంబులని వేఱె చెప్పనేల? ఇట్టి పుస్తకభాండాగారములను స్థాపించినవారు భుజంగసార్వభౌములుదక్క జగంబున వేఱెవ్వరును లేరఁట! ఓహోహో! ఈప్రభాకరకవి యాప్రభాకరునివలె జగమునంతయు శోధించుచున్నాఁడు కాఁబోలు! 'హూణభాషాభ్యాసమొనరించి యాంగ్లేయదొరలతో నొకయెత్తు తూగినాఁడ' నని వ్రాసికొనియుండిరే? అట్టిమహదావస్థ తటస్థమయినను వీరికి పుస్తకభాండాగారములీ యపూర్వభుజంగసార్వభౌముని పుస్తకభాండాగారముకన్న లక్షమడుంగులధికమయినవి జగంబున వేనవేలున్నవని యపూర్వక

విసార్వభౌమునకుఁ దెలియకుండుటయెంత సిగ్గులచేటు? 'ఆజమీందారునుదారు ఘోరుపరదారకుమారు విచారశేముషీదూరు భుజంగరాజబహదూరు' నని భుజంగసార్వభౌములను వర్ణించిరిగాన 'పరదారకుమారు విశేషశేముషీదూరు' అనుదానికినర్థము దెలిపినన్ గృతార్థునిఁజేయ నాయపూర్వకవి సార్వభౌముని వినయవిధేయుండనై వేడుకొనుచున్నాఁడను. మఱియు, నోప్రభాకరకవి సార్వభౌమా! 'సంస్కృతంబందును సాధారణప్రజ్ఞ గలిగితత్సంగతి వెలసినాఁడ' నని చెప్పుకొన్న మీరు సంస్కృతమునందసాధారణప్రజ్ఞ గలిగి పంచమవేదమయిన భారతము నాంధ్రీకరించి 'కవిబ్రహ్మ' యనిపేరొందిన తిక్కనకు పైత్యమెట్లు విడిపింపగలరో విశదీకరింపఁ గోరుచున్నాఁడను.

సత్యప్రియుఁడు.

శశిలేఖ.

1898 సం॥ సెప్టెంబరు తే 20 ది.

మంగళవారము.

మం జు వా ణి.

గోదావరిజిల్లా, ఏలూరువాస్తవ్యులగు శ్రీరాజా మంత్రిప్రగడ భుజంగరావు బహద్దరు జమీందార్ గారు ప్రచురించుచుండు మంజువాణియను మాసపత్రిక రెండు సంపుటములును, రెండవదానితోడఁ బంపఁబడిన కవిరాజసందర్శనమును, మాకందినవి. కృతజ్ఞతతో వందనములాచరించితిమి. దేశభాషలు క్షీణించుచుండు నీకాలములో నాంధ్రదేశము నలంకరించియుండు నీజమీందారుగారు కవనముచెప్పగలిగినంతపాండిత్యముగలవారై, దేశాభిమానులై వారికిగలిగియుండు నుపపత్తులవలనఁ బ్రజలకుపయోగపడు కార్యములు సేయవలయునని సమకట్టుటెంతయు శ్లాఘనీయమయిన కార్యమనుటకెంతయు సందియములేదు. శ్రీభుజంగరావుబహద్దరుగారికిప్పుడీవిషయములోఁగలిగియుండు నుత్సాహమిటులనే వృద్ధియగుచుండవలయుననియు, వీరివలన నాంధ్రభాష మఱింతవన్నెకెక్కవలయునని మాయాశయము. శ్రీవారుధనికులగుటం జేసి, ద్రవ్యోపపత్తిలేని విద్వాంసులు చేయలేనిపనులువీరికి సులభసాధ్యములగును గదా? ఇఁక నీమంజువాణిలో వ్రాయఁబడియుండు వ్యాసములలో నొక్కొకదాని గుఱించి నాలుగుమాటలువ్రాసి, ఎటులుండిననీపత్రికమనకు మేలుచేయుటకు సాధనమగునో విశదీకరించువారము.

మొదటిసంచికలో మునుముందుగ శ్రీవారు తమరాజభక్తి సూచకముగ 'విక్టోరియా' తారావళిని ముద్రించిరి. ఈతారావళిని వీరిదివఱకే ముద్రించియుండుట

చేత పదంపడి యీసంచికలో దీనిఁజొప్పించినదంత మంచి కార్యముకాదు. చర్విత చర్వణముగ నున్నది.

రెండవది.— 'శృంగారరసప్రవాహిని.' శృంగారరసము మన పూర్వకవులు వ్రాసిన గ్రంథములలో వెల్లివిరిసియున్నది. ఈరసమువలనపాఠకులు నీరసులగుచున్నారేకాని సరసులగుటలేదు. భారత, రామాయణ, భాగవతాదిగ్రంథములను సహా యీకాలమున నధికారులుసవరించి, యీశృంగారరసమును మట్టుపఱచు[illegible]టకు యత్నించుచుండగా, నవీనముగ పత్రికలు, గ్రంథములు, వ్రాయువారీరసమును మట్టుపఱచుటే 'శ్రేయోదాయకమని మాయాశయము.

మూఁడవది.— కాకుమానిమూర్తికవి, అడిదముసూరకవి, కూచిమంచి తిమ్మకవి, వడ్డాదిసుబ్బరాయకవి, వ్రాసినకావ్యములు ప్రచురింపఁబడినవి. ఇదివఱకచ్చుపడని గ్రంథంబుల నచ్చొత్తించుటకు అముద్రితగ్రంథచింతామణి, చింతామణి, వైజయంతి, మొదలగుసాధనములేర్పడి యుండుటంజేసి, 'మంజువాణి' యీపనిం బూనుకొనుటవలన మేలు హెచ్చుగలభించదనుకొనుచున్నారము.

నాల్గవది.— బ్ర. శ్రీ. గురుజాడ శ్రీరామమూర్తిగారిచే వ్రాయఁబడిన 'అప్పయ్యదీక్షితచారిత్రము.' ఆదిశంకరులు రామానుజాచార్యులు, వేదాంతదేశికులు, మొదలగువారిజీవితములు విశేషముగ పుక్కిటిపురాణములతో మిళితమైయుండును. నిజమిట్టిదని విశదపడలేదు.

మతవిషయముగ సంభావించినను, అప్పయ్యదీక్షితులవారి చరిత్రమువలనమనకుఁగలుగఁగల మేలెట్టిది? వీరు వైష్ణవులను నోడించిరా? ఓడించినను, నోడించకపోయినను, ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతములు దీర్ఘకాలమునుండి నాటుకొనియుండుటంజేసి, యీకాలములో నీమూటిలో సారముగల మతమిదియని సిద్ధాంతీకరించుట యనవసరమయిన పనికిమాలినకార్యమని మా యభిప్రాయము. మిక్కిలి యిట్టివ్యాసములవలన మేలులేకపోయినను, నిరర్థకములయిన మతద్వేషములుగలుగునేమోయనిభయపడుచున్నారము. వైష్ణవులు శైవులను, శైవులు వైష్ణవులను నిరసించి పత్రికలు వ్రాయుట యుక్తియుక్తమయిన యోచనకాదు.

ఐదవవిషయము.—వైద్యశాస్త్రము, వ్యవసాయమును గురించి పట్టివ్రాతలవల్లను నుపన్యాసములవల్లను లాభమిట్టిదని మాకు బోధపడలేదు. మన పెద్దలు వైద్యశాస్త్రమును సంపూర్ణముగ వ్రాసియుంచియున్నారు. ఇఁక నవీనులు వ్రాయవలసినపని మిక్కిలిలేదు. ద్రవ్యసహాయముండినచో వారుచేసిన సిద్ధాంతముల ననుభవములోనికిఁ దెచ్చుటయుక్తము. కలకత్తాజమీందారుల సహాయమువలన నచటనొక గొప్పపండితుఁడు "ఆయుర్వేద" శాలనునిర్మించి మన ఆయుర్వేద శాస్త్రములోఁ జెప్పబడినటుల నౌషధములుచేసి వ్యాధులను గుదుర్చుచున్నాఁడు. మన శ్రీ భుజంగరావుగారును నిట్టిశాస్త్రజ్ఞులద్వారా యౌషధశాలను వారిజమీందారీలో నేర్పరచి

[illegible]రదులు చేయించి, ప్రజలరోగములను దొలఁగించి కీర్తిగాంచవలయును.

వ్యవసాయము.—మనదేశములో విద్య నేర్చినవారికి చేరెడుభూమియైనను లేదు. భూములుండురయితుల కక్షరజ్ఞానమే లేదు. కనుక వ్యవసాయమునుగురించి, యెన్ని రీములకాగితములు, ఎన్ని బుడ్లఇంకి వెచ్చింపఁబడినను మనకాపులస్థితి బాగుపడ నేరదు. ఈయంశముకాపులకు బాగుగ బోధపడవలయుననినచో శ్రీవారు జమీందారులగుటంజేసి, చెన్నపురి ఆగ్రికల్చరల్ శాస్త్రపాఠశాలలోఁ జదివి పరీక్షలిచ్చినవారిని తమనౌకరిలోనుంచుకొని, ఎక్స్పిరిమెంటల్ ఫారములు, అనగా నానావిధములగు పైరుచేసి చూపునట్టిభూములు నేర్పరచి, తద్వారా, కాపులకు, వ్యవసాయవిషయమును నేర్పవలయును. వైద్యశాస్త్రము, వ్యవసాయము, వ్యాసములవల్లను ఉపన్యాసములవల్లను బోధపడవు. అభ్యాసమువల్లనే యవిలభ్యముగాఁదగినవి.

మంజువాణిలో వ్రాయఁబడిన విషయములనుగురించి మోమోటములేక మాకుస్ఫురించిన యభిప్రాయములను విశదీకరించితిమి.

ఈకాలమున మనకెట్టివార్తాపత్రికవలసియున్నదో తెలిపెదము. వార్తాపత్రికలు, గ్రంథములనుముద్రించుపత్రికలు, మనరాజధానిలో నాంధ్రభాషలో వ్రాయబడుచునేయున్నవి. మనకు ముఖ్యముగవలసియుండునది 'రివ్యూ,' అనుపత్రిక, ఇట్టిది మాసమునకొకసారి, లేక, రెండునెలలకొకసారి, లేక. మూఁడుమాసముల కొకసారి, యైన ప్రచురింపఁబడవలయును. దీనిలోగొప్పగొప్పపండితులు దీర్ఘముగ నాలోచనచేసి వ్రాసినవ్యాసములు వ్యాసకర్తల సంతకములతో ముద్రింపఁబడవలయును.

ఈ 'రివ్యూ' లేక 'మాగజిన్' లో రాజకీయ వ్యవహారములు, మతము, నీతి, విద్య, సంఘసంస్కరణము మొదలగువిషయములు, ఆయావిషయములు బాగుగ బోధపరుచుకొనినవారిచే వ్రాయఁబడుచుండవలయును. ఇట్టి రివ్యూలు ఆంగ్లేయభాషలో దిక్కుమాలినన్ని ప్రచురింపఁబడుచున్నవి. వాటిలో వ్రాయఁబడిన వ్యాసములు తాత్కాలిక ప్రయోజనములై యుండుటేకాక, యిఁకనూరుసంవత్సరములకుపిమ్మట నుపయోగించునట్టివిగ నుండును. ఇట్టి రివ్యూ ఆంధ్రభాషలో నొకటుండవలయునని మాయభిమతము. ఈపనికి ద్రవ్యోపపత్తి విశేషముగ వలయును. దీనిలో వ్యాసములు వ్రాయువారికి ఒక్కొక్కవ్యాసమునకింతమాత్రమని పారితోషికమిచ్చునట్టి యేర్పాటుండవలయును. ఆలోచనలేనివారు, ఈషాన్యతత్పరులు. వారివారిదుఃఖములను వెలిపఱచుటకిది సాధనముకాఁగూడదు. ఇట్టిరివ్యూవలన మనయాంధ్రదేశమునకెంతో మేలుగలుగునని మేముదీర్ఘకాలమునుండి సంభావించుచున్నారము.

ఇట్టిరివ్యూను భాషాభిమానులు ధనికులునునగు శ్రీరాజామంత్రిప్రగడ భుజంగరావు గారివంటివారే సంస్థాపింపనర్హులు. కనుక, పేరుమార్చకయ, యీమంజువాణిని మేముచూపినమార్గమునకుఁ ద్రిప్పి శ్లాఘనీయులుగావలయునని శ్రీభుజంగరావుగారికి విన్నవించుచున్నారము.

చిక్కులగుఱ్ఱమునకు కక్కులకళ్ళెము.

శశిలేఖయందు మశిలేఖయొక్కటియున్నట్లు దానిదర్శించువారికందఱికిని విశదమే కదా. ఇఁకనదియెట్లువచ్చినదనఁ బండితులు నిర్ధారణముగా నేకారణమును జెప్పఁజాలకున్నారు. కొందఱుసహజలాంఛనమనియు మఱికొందఱు పంకమనియు నిఁక కొందఱుతమమనియు నుడువుచున్నారు. ఇవిసరియేకాని యివికాక యిఁక రెండు సద్హేతువులుగూడఁ గలవు. అవియేవియనిన,— ౧. శశిలేఖ యందలి యీవైవర్ణ్యము మంజువాణీముఖసౌందర్యాతిశయమును జూచుటచే సంజాతమైన యీర్ష్యవలన వచ్చినది కొంతయు, ౨. వీరభద్రపదసంఘట్టన సంజాతగర్తవశంబునవచ్చినది కొంతయునుంగూడఁగలిగినదైయున్నది.

ఈదోషాకరబింబమునందు నిట్టియీర్ష్యయుండుట వింతకాదు. ఆంధ్ర కుమారసంభవకృతిపతులు తన్నే చవితినాడో చూచియుంజూడనట్లు చూచినంతమాత్రమున నాకృతికర్తగారియందును, భర్తగారియందును గృతియందునుగూడ నిరాపనిందలనిదివఱకు మోపిప్రసిద్ధినిగాంచినదై యున్నది. మిత్రత్వము నూనియున్న యాంధ్రపత్రికాశికతో వైరమును వృథాగాఁబూనినది. లోకవిఖ్యాతులగు వివేకానంద స్వాములవారను గణాధినాథునిజూచి గర్వాతిశయంబునఁ బకపకనగినది. ఇట్టిశశిలేఖకు మంజువాణీముఖపద్మమునందు నీసువుట్టుట వింతకాదనికోవిదులు గ్రహింపకపోరనితలంచెదను. దానికేమిదానిపదప్రహారవిశేషముంగూర్చిచర్చింతము.

(౧) అయ్యంగారిశశిలేఖకు నప్పయదీక్షిత చారిత్రమునందు నసహ్యముపుట్టుటవింతకాదు. కానిదాని నెంత తెలివిగా వ్యక్తీకరించినదో యాగమనికనువిబుధులు పరికింతురుగాక.

"ద్వైతాద్వైతవిశిష్టాద్వైతమతములు దీర్ఘకాలమునుండి నాటుకొని యుండుటంజేసి యీకాలములో నీమూటిలో సారముగల మతమిదియని సిద్ధాంతీకరించుటయనవసరమయిన పనికిమాలినకార్యమని మాయభిప్రాయము. మీదుమిక్కిలి ఇట్టి వ్యాసములవలన మేలులేకపోయినను, నిరర్థకములయిన మతద్వేషములు గలుగునేమోయని భయపడుచున్నారము."

అనిమతవిషయకములగు చర్చలవలన ద్వేషములుపుట్టునని నుడువుచు మరల "కోడలికిబుద్ధిచెప్పి యత్తయేమో చేసినది" అనుసామ్యముగాఁ దానుశ్రీమంజువాణికిచ్చిన యుపదేశములో "రివ్యూ" (విమర్శ) అనుపత్రికనుంచి యందు మతవిషయములు చర్చించవలెనని చెప్పుచున్నది. హా! ఏమియీ తెలివి. ఈతనరివ్యూలో ముచ్చటింపఁబడవలసిన మతమేది? ద్వైతవిసిష్టాద్వైతాద్వైతములు పనికిరావుగదా. ఇఁకనే

ది. క్రీస్తుమతమా? మహమ్మదీయమతమా? లేక బ్రహ్మసమాజమతమా? ఇవి మనదేశమునందు బయి వానివలెఁ జిరకాలమునుండి యున్నవికావుకాని వీనిచర్చవలననైనను ద్వేషములుపుట్టవా? ఆపనియీవఱకే పలుపత్రికలయందుఁ జరిగియుండలేదా? ద్వేషములురాలేదా? లాభమేమికలిగినది? లేకలోకైకమతమునొకదానిని నూతనముగా బోధించుమనునా! అట్లయినను అట్లులోకైకమతమును (Univursal religein) బోధించు* వివేకానందస్వాముల వారిని దానిదివఱకు వెక్కిరించియేయున్నది. గాననిఁక నీశశిలేఖకు నొరులుచెప్పినదికాదను నభిలాషవిశేషమగుటచే వచ్చినవికారమేకానియిది వేఱుకాదని విజ్ఞులుతలఁచవలెను.

(౨) అముద్రితగ్రంథములసంపాదించి వానిమంజువాణిచక్కఁగా ముద్రించుచుండ దానికిసంతసించుటకుమాఱుగా నీశశిలేఖ దానిట్లధిక్షేపించుచున్నది.

"ఇదివఱకచ్చుపడనిగ్రంథముల————దనుకొనుచున్నారము." అని.

ఇదివఱకు కొన్నిసాధనములున్నను నింకనొకటి పుట్టుటవలన మేలేకలుగును గదా. తన "రివ్యూ" విషయములో "రివ్యూలు" "ఆంగ్లేయభాషలో దిక్కుమాలినన్ని ప్రచురింపఁబడుచున్నవి-" అనివ్రాసినది. ఆహాయేమియీపదప్రయోగము! దిక్కుమాలినన్నియున్నవని యధిక్షేపించుటయో భూషించుటయో తెలియకున్నది. ఆక్షేపణమయినచో నధికముగా రివ్యూలవేయు నాయాంగ్లేయ పండితులు మూర్ఖులనియే యీమహావివేక నిధితలంపుకాఁబోలు. దానికేమి ఆంగ్లోభాషలో రివ్యూలు దిక్కుమాలినన్నియుండి లాభమునుగలిగించినట్లె యిందునునముద్రితగ్రంథములఁ బ్రకటించుపత్రికలు రెండుమూడున్నను దీనినిఁబ్రకటింపవలసివచ్చినది. మఱియు నముద్రితగ్రంథచింతామణియుండఁగా, చింతామణిబయలుదేరనేల? ఈరెండును నుండఁగా వైజయంతి వెలువడనేల? వానినీలేఖయేందుకు శంకించినదికాదు? ఇంకనువైజయంతితిన్నఁగఁ బ్రచురింపఁబడుట లేదుకనుకను, అముద్రితగ్రంథచింతామణి, చింతామణులందుఁ బూర్వకవులగ్రంథములు తక్కువగాఁ బడుచుండుటచేతను నిదియుదయించినదని శశిలేఖగ్రహించునుగాక

అదియునుంగాక ఆంధ్రప్రకాశికాది వార్తాపత్రికలనేకములుండఁగా నీవంకరటింకరశశిలేఖ బయలుదేరనేల? కూపస్థమండూకమువలె తనకలగూరగంపతోడనేలోకమునిలుచుచున్నదని యెంచుచున్నదికాఁబోలును. ఇంతటి మహావివేకులు తామేల యీగంపలు 'రివ్యూ' పదార్థముతో నింపరాదు? ఈగంపపై శశిరేఖ యను పంగనామమునుంచనేల? "పరోపదేశసమయే సర్వఏవహిపండితాః। స్వానుష్టానస్వసమయే మునయోపినపండితాః" అనునార్యోక్తికి లక్ష్యములేకపోవునను భయంబు వనీవెడగువ్రాఁత శశిలేఖవ్రాసియుండనోపు.

(౩) వైద్యశాస్త్రము. వ్యవసాయమునుగురించి————ననుభవములోనికిఁ దెచ్చుటయుక్తము;— ఈ తెలివి నేమనిచెప్పవచ్చును? ఎందుకువచ్చినవ్రాఁతయిది. మన పెద్దలువ్రాసియున్నను నవిసంస్కృతమునన్న విగానవానినాంధ్రులయుపయోగార్థము తెనుఁగునవ్రాయుటమంచిది. మఱియునితరదేశ వైద్యశాస్త్ర సాంప్రదాయములుకొన్ని మనశాస్త్రమందు లేనివియుండునుగాన వానినిఁగూర్చియు వ్రాయుట యవసరము. అదియటుండ నీసహజ కళంకమూర్తియగుశశిలేఖ 'రివ్యూ' పెట్టవలయునని యు నందునీతిబోధింపవలెననియు నుడువుచున్నదెగదా. ఇదియేల? నీతులు పూర్వగ్రంథములందుఁ గుప్పలుతిప్పలుగానున్నవి. మరలవానినుడువనేల? శశిలేఖవట్టి పరోపదేశపాండిత్యమునే పొందియుండకతనయందలి మసినిబాగుజేసికొని యొరులకుఁదన నడతయొక్క యోగ్యతనుబోధించిన బాగుండుననఁదగునుగదా. అదియటుండనిందుమంజువాణియందు వైద్యవిషయమేలేదు. అందున్నది వైద్యుతలోహశాస్త్ర విషయము. అదివైద్యముకాదు. మొదటిరెండక్షరములనుబట్టి యదివైద్యశాస్త్రమనుకొనిన యీశశిలేఖయొక్క కళావిశేషమునేమని చెప్పవచ్చును! వైద్యుతలోహశాస్త్రమనఁగా, విద్యుత్ (మెఱుపు) లోహమువీనినిఁగూర్చి ముచ్చటించునది విద్యుచ్ఛక్తిసహాయముతో వస్తువులందులోహపు పూతనుబూయుట లోనగువిషయముల నిదిముచ్చటించును. వ్యవసాయమునుగూర్చి శశిలేఖ వ్రాసినదంతయును నజ్ఞానవశమున వచ్చినదైయున్నది. ఈశశిలేఖదేశమందు జదువుకొనిన వారందఱు నొకవేళమాన్యహీనులై యున్నారేమోకాని మాదేశమందట్లుకాదు. అదిగాకరయితులకుపయోగించు విషయములశశిలేఖ తానప్పుడప్పుడు ప్రకటించితనసహజ కళంకభాగమందేకాక యితరస్వచ్ఛభాగమందుఁగూడ మసిపూసికొనెగదా దాని ప్రయోజనమేమి? విజ్ఞులెవరైన నీ వక్రలేఖ తలఁచినట్లు తలంతురా?

(౪) మొదటిపత్రికయందుఁ దల్లులకుఁ దల్లియు రాజులపై రాజ్ఞియును నయిన శ్రీవిక్టోరియా మహారాజ్ఞిపై వ్రాయఁబడిన విక్టోరియాతారావళినిఁ బ్రకటించియుండఁగా నదియిదివఱకు ముద్రింపఁబడియున్నదిగాన మరలముద్రింపఁబనిలేదని శశిలేఖ యధిక్షేపించుచున్నది. ఒకమారుముద్రించినగ్రంథమును మరలముద్రింపఁజనదని యీ శశిలేఖతలంపు గాఁబోలు? పోలుఁబోలు. ఇట్టిదురాక్షేపణములకు సమాధానమును జెప్పుటమిగుల కష్టమేకదా. ఒకమాఱు ఇదిముద్రింపఁబడినను మంజువాణిచందాదారులందఱును దానిఁజూచిరా? ఏలయీయాక్షేపణము? ఎట్లయినఁ బ్రతివిషయమునధిక్షేపింపవలెనను దురూహవలనఁ గలిగినదిగాక మఱొండగునా?

(౫) శృంగారరసమిప్పుడు పనికిరాదను విషయమునుగూర్చి మేమంతగా వ్రాయము ఇట్టివెఱ్ఱులు పల్వురిదినములలోఁ గలరనుటకుసందియములేదు. రసజ్ఞతలేనివారికిది రుచించుటకష్టమేకాని యట్టివారికొఱకు శృంగారరసప్రవాహిని వ్రాయఁబడుటయేలేదు.

ఓశశిలేఖా! నీయీజ్ఞానముంబట్టిజూడ నీబుద్ధికిఁదోఁచు నీవె 'రివ్యూ' గామార్చనబాగుండునని తోఁచుచున్నది. మార్గదర్శమగు 'రివ్యూ' ఒకటి కవిరాజసందర్శనమునుగూర్చి ప్రకటించియుంటివిగదా. ఇట్టివానితో నేనీగంపను నింపిలోకమునఁ దగుపదిమునందుము.

ఓమంజువాణీ! నీవీవెడగువ్రాఁతలకుఁ జంకకు.

ఉ. పీనసరోగినిన్నుఁదిల-పిష్టసమానముగాఁగఁజూచినన్।
వానివివేకశూన్యతకు-వందఁగనేలకురంగనాభమా।
మానవతీకపోలకుచ-మండలమండితచిత్రపత్రికా।
నూనవిశేషవాసనల-నూనుటలోకులునిన్నెఱుంగరే॥

కాశీభట్ల బ్రహ్మయ్యగారు.

కవిరాజసందర్శనవిమర్శనోచ్ఛేదనము.

"తిక్కనకుఁదిక్కవిడిపించుతెలివికలఁడు" అను తేటగీత పాదంబుగ్రహించి యదియెంతెయో పరిహాసాస్పదమై నిందవహయునని భ్రాంతిచేవ్రాసి ది ౧౯౧౯-౨౦ సంవత్సరపు శశిలేఖసంచికయందుఁ బ్రచురింపఁజేసెను. "తిక్కనకుఁదిక్కవిడిపించుతెలివిగలఁడు" అనుపాదమునకుఁ బైనున్న "కాలమొకరీతినున్నది గాకయున్న" అనుపాదమే సదుత్తరదాయకంబైయుండ, దానిగ్రహించి యర్థసమగ్రహణంబుజేయలేని కొంతలేఖరికిఁకనైనఁ జింతఁగలుగఁజేయనేరకపోదని భావించెద. ఈకాలమున నాంధ్రభాషరాజాదరణశూన్యంబాయెనుగాని లేనియెడల దానియందు నాకుఁగలయనురాగమున కిప్పటికవితాప్రసంగమునకన్న నెక్కువుగ వ్రాయువాఁడనని కవియభిప్రాయము. దీనినే కార్యకారణ విపర్యయరూపాతిశయోక్త్యలంకారమని యలంకారశాస్త్రజ్ఞులు వాడుచుందురు. కాన వారు స్వప్రాగల్భ్యోచ్చరితులని దురభిప్రాయసంలగ్నహృదయుఁడగు సత్యప్రియుఁయిఁకనైన దుశ్చింతలు వాయుఁగావుత.

II.

౧. అపూర్వాలంకారములతో నొడలుశృంగారించుకొని.

౨. శృంగారరసప్రవాహమును బ్రవహింపనుత్సహించెడి; మంజువాణీపత్రికం దిలకించితిరాయని సహసాద్భుతచిత్తుఁడై ప్రశ్నించు నీసత్యప్రియుడు, దానవపూర్వాలంకారంబు లేవియోవివరింపకయె యవి యపూర్వాలంకారములని నుడువుచున్నాఁడు. ఈలోకాపూర్వ్వనకీప్రపంచమంతయు నపూర్వముగానేతోఁచుచుండు

ను. కానఁ బ్రమాదనిర్ధారణాసమర్థవ్యర్థవర్ధిష్ణున కిదియె యుత్తరము. శృంగారరసమును బ్రవహింపనుత్సహించెడు ననిరసహాసాస్పదుఁడగు వీనిఘనతఁగొనియ్యాడఁదగునా? శృంగారంబన నర్థంబితఁడెఱిఁగినవాఁడై యుండవచ్చునా? ఎఱిఁగిన నిటు వ్రాయునా? శృంగారమన, „శృంగంప్రాధాన్యంఇయర్తీతిశృంగారః" అనఁగా సర్వరసములలోను నుత్కృష్టమైనదని యభిప్రాయము.

„శృంగారయేవమధురః-పరఃప్రహ్లాదకోరసః।
తన్మయంకావ్యమాశ్రిత్య-మాధుర్యంప్రతితిష్ఠతి।

కనుక నే తద్రసవిహీనగ్రంథము శూన్యాదరణంబని వేఱనుడువనేల? శృంగారరసము నాదరించినవారందఱు వీనిపాటి వివేకయుక్తసంపన్నులుగాకయేయుందురుకాఁబోలు. పెద్దలు,

శ్లో॥ శృంగారైకరసస్మరోస్తుజగదా-నందైకనిష్యందభూ।
రిందుస్త్విష్టతువిభ్రమైకవసతి-ర్జాగర్తుపుష్పాకరః॥

అనివచియించియుండిరి.

అనఁగాఁ బ్రపంచోత్పాదన హేతుభూత విరహజనకుఁడగు మరునకు ప్రధానమైనరసము శృంగారమైయున్నది. అదిగాక నాటకమునకు „వీరశృంగారయోరేకః-ప్రాధాన్యంయత్రవర్ణ్యతే। ప్రఖ్యాతనాయకోపేతం-నాటకంతదుదాహృతం॥ అని లక్షణమువ్రాయఁబడెను. తల్లక్షణానుసారంబున శృంగారరస ప్రధానంబైన నాటకంబెద్దియైననుండిన నది యీసత్యప్రియునియభిప్రాయానుసారముగా, నాశనము జేయఁబడవలసినదేనా? మఱియును, ప్రకరణమందు „ప్రకరణేఉత్పాద్యమితివృత్తం ధీరశాంతోనాయకః శృంగారరసస్యైవప్రాధాన్యం" అనిలక్షణము వ్రాయఁబడెను. తల్లక్షణానుసారంబై, ఏతత్శృంగారరస భూయిష్టంబులైన సర్వప్రకరణంబులును నీతనియభిప్రాయప్రకారము నశింపఁబడవలసినవేనా? అదికాకపైనఁజెప్పిన శృంగారరసవిషయములో మొదటియంశములోఁ జెప్పినప్రకారము, మన్మథుఁడొక్క శృంగారరసస్వరూపుడగు అదిలేమి, మన్మథుఁడు శుద్ధవ్యర్థుఁడుగదా! మదనుఁడు సృష్ట్యుత్పాదనహేతుఁడని పూర్వులునుడివియుండిరి. ఆదియెటులన—

శ్లో॥ చేతోహరస్యనజహాతిసమాధిముద్రాం
చేతస్యకాండవికృతిఁకురుకాండకాండైః।
వర్తేతసాధువికృతిస్సుతజన్మహేతు
ర్జాతస్సుతఃకిలభవేదసురప్రమాధీ" అని.

దీనిభావము సమాధిముద్ర విడువని సాంబమూర్తి హృదయము బాణములచేఁ గలఁతనొందఁజేయుమనియు నటులలెస్సగా కుమారజన్మహేతుభూతమైన వికృతినిఁజేసినయెడల నసురప్రమాధియైన సుతోత్పత్తికలుగునని యైయున్నది. అందు

ననుసరించి స్త్రీపురుష సంఘటనేచ్ఛకు సహితము కారణము మదనుఁడనుటకు సందియములేదు. అట్టి శృంగారరసస్వరూపుఁడగు మన్మథుఁడు శృంగారరస వ్యర్థుఁడైయసమర్థుఁడైయుండఁ బ్రపంచోత్పత్తికిని, సందేహముకలుగనేరకపోదు. అదిగాక మహాకవులగువారుసహితము మహానాటకములలో ననగత్యముగ సంధ్యాకాలవర్ణనలోసహితము శృంగారరసము నతివర్ణించిరి. ఎటులన:—

శ్లో॥ లోలత్పశ్చిమసింధురాజసలిల ప్రోద్యత్ప్రవాళాయితా।
సంధ్యాపుష్పవతీవరక్తజలదాసాయంతనీభాసతే॥ అని.

వేయిమాటలేలను? గ్రంథవిస్తరభీతిచేత వ్రాయుట సంకుచితించితిగాని గీర్వాణంబునంగల నాటక మహాకావ్యాదిగ్రంథములయందును నాంధ్రభాషయందుగల ప్రబంధాదులయందును శృంగారరసమె యెక్కుడుగ వర్ణించియుండిరి. వారు వీనిపాటి యుక్తియుక్తప్రసంగ సంయుత కవితాదురంధరులు కాకయే యుందురని నమ్మవలసినస్థితిసంభవించెను. ఇదియునుగాక, శృంగారరసమీతని హృదయంబునకు వ్యభిచారహేతువని తోచకయేయుండిన దీనికైయింతభీతిల్లునా? కేవలశృంగారరసపరిజ్ఞాన హేతుతామోదమే వ్యభిచారమూలమగునని యీసత్యప్రియుడు తలచుటఁగాఁబోలు శృంగారరసనాశనోపాయము లరయుచుండెను. శృంగారరసమను శబ్దార్థజ్ఞానపరిభావేశమీతనిహృదయంబున నది పానీయంబగు రసాతిరేకంబనియు నదిత్రావిన చో భరించపక వర్జింపరాని వికటోత్పత్తియగుననియు నందున వ్యభిచారోత్పత్తియగుననియునైయుండవచ్చును. లోకసామాన్యంబుగఁ గులస్త్రీలతోనొనర్చు క్రీడనుసహితము మరుక్రీడయనియు, శృంగారక్రీడయనియు, నామాంతరంబులవాడుచుందురు. కులస్త్రీనిగూడినను నాకూడికకుకూడ సంభోగశృంగారమనిపేరు. లేనియెడలఁ బశుపక్ష్యాది వద్వివేశసంభోగార్తులై యుండుడనిన మానవులు, పశుపక్ష్యాదులవలె శృంగారరస శబ్దోచ్చారణాకర్ణ నాశక్తులైయుండుమను పశుధర్మమంగీకరింపనేరరు. శృంగారరసజ్ఞానవిహీనములైనను బశుపక్ష్యాదులుసహితము నియామకస్థల సంచారాతీతములైయుండెను. అటులైనను వ్యభిచారము మానదాయెను. అయ్యయ్యో! ఈసత్యప్రియు డెంతదురాలోచన సంసక్తుఁడాయెను! శృంగారమే మోయెఱుఁగనిక్షుద్రు లెందఱు వ్యభిచారపూర్ణాసక్తులై కాంతానురక్తులైకలధనాదుల వ్యయపరుచుచుండిరి! అదియుంగాక శృంగారరసపూరితంబులగు కావ్యాదులరచించిన ననాథనాథునికులపై నెంతవైరంబుసాధించినవాఁడాయెను! పరస్త్రీముఖావలోకనవిరక్తులును రసికజనమనోరంజనాదిశృగారప్రబంధరచనాధురంధరులునునవీనులును గీర్వాణశకుంతలాది శృంగారనాటకాంధ్రీకరణదక్షులునగు,మ॥రా॥రా॥రాయబహద్దరు కందుకూరివీరేశలింగముపంతులుగారుసహితమటులైన నిందాపాత్రులగుదురుగదా! ఈతఁడెందఱిహృదయంబులకామోదుండుకాకపోయెను! శృంగారరసపూరితగ్రంథంబులనెవ్వరైననూ తనంబుగరచింపనున్నను క్రొత్తగనాంధ్రీకరింపనున్నను

నీసత్యప్రియునీతివచనం బామోదింపవలసినదేకాఁబోలును! ఈసత్యప్రియుఁడుసద్గ్రంథకల్పనాసామర్థ్యంబునఁ బేరువడయకున్నను నీరీతినైనఁబేరువడయుచుండుట సంతసింపవలసినదే. „ఘటంభింద్యాత్ పటంఛింద్యాత్ కుర్యాద్వా గార్ధభస్వరం యేనకేనాప్యుపాయేనప్రసిద్ధః పురుషోభవేదనువచనమనుసరించినవాఁడయ్యెను. సృష్ట్యాతీతజ్ఞానవిభవోపేతస్వరూపుఁడగువానినననేల!„శ్లో॥ ఏతజ్జ్ఞానవిహీనపుంసరచనామోదం విచిత్రంవిధేః" అనితలపోసితలపోసియీవిషయమును బెంచివ్రాయక యింతవిరమించుచున్నాను. ఈవిషయముకృష్ణావృత్తాంతినియందుఁగూడజర్చింపఁబడె,

III

మంజువాణికి——„దిక్కనకుఁదిక్కవిడిపించు తెలివిగలడట్టి. ౧. కవిరాజుచేత ౨. సార్వభౌమత్వమువడసి 3. శ్రీమదానందగజపతిక్షితిపతికన్నఁ బ్రాగల్భ్యగన్న భుజంగసార్వభౌముఁడుపత్రికాధిపతియన్నమాట, అందునఁగలయీయనవిగ్రహమే తెల్పుచున్నది. ఇందులో;—

౧కవిరాజనుసందర్భంబునరాజశబ్దమునకు శ్రేష్ఠమర్థముగ్రహించినయెడలనే తత్సమయసందర్భార్థభ్రంశంబైగ్రంథాభిప్రాయశూన్యంబగును. కవిరాజులపరస్పరసందర్భనమనికాని వేఱుకాదు. అయిననీప్రతిపదసంఘటనార్థభ్రంశస్వభావంబులెవరుచక్కఁజేయఁగలరు?

౨ శ్రీభుజంగరావుబహద్దరుజమీందారుగారు సార్వభౌములుకారని యీకవిగారుతెలియకవ్రాయునదికాదు. ఈకవిగారుపురాణభాషాభ్యాసులగుటంజేసి యిప్పటిపరిపాలకులను బూర్ణముగగుర్తెఱుఁగుదురనుటకుసందియములేదు. వారలంకారశాస్త్రజ్ఞులుగావున నిటులఁబ్రయోగించిరి. దీనినే భేదేఽభేదోక్త్యలంకారమని శాస్త్రజ్ఞులునుడివెదరు.

ఇదియునుంగాక, పూర్వకవులునుభోజమహారాజవర్ణన యందీశ్వరాధిష్ఠితసర్వజ్ఞత్వాదుల ప్రభువుయందుసమర్థించిరి. అందునకుదాహరణము,

శ్లో॥ సర్వజ్ఞత్వమధీశ్వరత్వమగమత్త్వాంమాంతుభిక్షాటనం॥
కాళిదాసుగూడభోజమహారాజుంగూర్చి.

శ్లో॥ మహారాజశ్రీమాన్ జగతియశసాతేధవళితే॥ అనివ్రాసియున్నాఁడుఆభోజచరిత్రమునందేశంకరకవి, భోజమహారాజుగారినివర్ణించినసమయములో;—

శ్లో॥ యథాయథాభోజయశోవివర్ధతేసితాంత్రిలోకీమివకర్తుముద్యతాం।
తథాతథామేహృదయంవిమాయతే ప్రియాలకాళీధవళత్వశంకయా॥

ఈయదియలంకారవిశిష్టంబుగాఁదలపోయవలయునుగానిభోజమహారాజు కీర్తియేడ? తచ్ఛంకరకవి భార్యాశిరోజములఁదెలుపుజేయుటయేడ? వీనినే, „అసంబంధే సంబంధోక్త్యలంకార" మనిపెద్దలుచెప్పెదరు.

శ్లో॥ రామస్యోచ్చండచాపాదవిరళగళితైఃకాండకాండప్రకాండైః।
దైతేయైఃఖండితాంగైర్వ్యదళితమసకృన్మూర్ఛితంఛండరస్మిం॥

తత్కాలంబున నీసత్యప్రియుఁడుండినఁ దనకుబోధపడనిదంతయు లోకాతీతమనిభావించివారల నీరీతినేదూషింపఁ బ్రారంభించుఁగాఁబోలును?

కవులలంకార విశిష్టపద్యరచనాస్వభావులు గాన, ఇందుప్రభాకరకవిగారు నిందార్హులుకానేరరు.

3 „శ్రీమదానందగజపతి క్షితిపతికినిఘనుఁడగు భుజంగసార్వభౌమునకుఁదక్క" అనుదానికిఅర్థభ్రంశముతిరుగసంభవించి మనోవిభ్రంశుడాయెను. అనగా శ్రీమదానందగజపతియీపుస్తకభాండాగారమేర్పరచెను. ఈభుజంగరావుబహద్దరుజమీందారుగారును నేర్పరచిరనికానివారికన్న వీరధికులనికాదు.

కావుననీయర్థభ్రంశదురభిప్రాయంబుతొలుగుగాత.

IV

„తిక్కన—తెలివికలఁడట్టికవిరాజుచేత" సార్వభౌమత్వమునువడసినరసికా—అనివ్రాయుదానికి జవాబువెనుక నేవ్రాసియుంటిని గానదియుగవ్రాయపిష్టపేషణం బనివిరమించినాను.

V

౧. „కాలమానుకూలముగలేదుగాని ఈయపూర్వకవి తిక్కనకుఁబట్టు తిక్కవిడిపించఁగలవాఁడ"ట - (౨) „ఇంతటికవియేమహాకావ్యము రచియించి వాసిఁగాంచెనో? [3] ఆత్మోత్కర్షతను ప్రకటించువారికవిత్వ మెట్లుండునో లోకంబునకేవిశదంబు.

౧. చిరకాలముక్రిందగతించిన తిక్కన, యీకాలంబుననుండుట యెంతసంభవమో, ఆతనితిక్కవిడిపించుటయు నంతేసంభవము - దీనినే అసంభవాలంకారమని వాడెదరు. నవరసాస్పదంబుగ స్వవిషయప్రజ్ఞాసూచకంబగు మహాకావ్యాదులరచించిమెప్పువడయక యధికులనధిక్షేపించెడువారల తిక్కవిడిపించుటకన్న బ్రస్తుతాసంభవుఁడగు తిక్కనతిక్కవిడిపించుటయే సుఖతరము.

౨. ఆమహాకవియనేక మహాకావ్యములరచియించి యుండెను. వానింబేర్కొనిననీర్ష్యాతత్పర హృదయులకిముడని, వాఁడ నగుదు నని వ్రాయ విరమించితిని బాల్యమునధనప్రమాదచిత్తులై శ్రీరాజాభుజంగరావుబహద్దరు జమీదారువారు సంచ

రింపక, యత్యంతప్రయత్నులై సర్వజనోపయోగముగ బుస్తకభాండాగార మునిచి మనయాంధ్రభాష నభివృద్ధిఁజేయుచుండ వారలయనురాగంబుజూచి యీగ్రంథము వ్రాసియ శుద్ధవ్యర్థవచనంబుల వారలనిందించి లోకంబులనిందల పాలగు వారలకేమి మెప్పు?అట్లుండిన నేమియొప్పు? లోకంబుననీపాటివిశేషజ్ఞులుండిననీపనికివారుం బూని యిట్టిమెప్పులువడయుదురు అటుగామి వారికివారేసామ్యులని చెప్పఁదగియున్నది.

3. ఆత్మోత్కర్షను బ్రకటించువారికవిత్వమసాదరణీయమనుటకు జవాబు. అదికవులకందరికిని స్వభావము. ఏలయన.—

తానుభయకవి మిత్రుఁడనిమాత్రమే చెప్పుకొనెనని నుడివినతిక్కనవిషయము లో వేఱె యుభయకవి మిత్రుఁడనియేల చెప్పుకొనవలెను? ఆతనిగ్రంథసందర్భనం బుననదిస్పష్టంబుగాకుండునా? అది స్వోత్కర్షకాదా? అదిగాక, ఆతిక్కనయే నిర్వచనోత్తరరామాయణమందు,

"అమలోదాత్తమనీష నేనుభయకా-వ్యప్రౌఢిఁబాటించుశి।
ల్పమునం బారగుడంగళావిదుఁడ" అనియు,

"జాత్యముగామినొప్పయిన-సంస్కృతమెయ్యెడజొన్ప వాక్యసాం।
గత్యము సేయుచోనయిన-గద్యముతోడుగఁజెప్పిపెట్టదా।
ర్గత్యముదోపప్రాసముప్ర-కారము వేఱగునక్షరంబులన్।
శ్రుత్యనురూపమంచునిడ-సూరులకివ్విధమింపుబెంపదే॥

అనియువ్రాసియుండెను..

ఇవియన్నియుసత్యప్రియునకు స్వోత్కర్షలుగా గాన్పించలేదుగాఁబోలు.

౨. ఈ యశుద్ధాంతఃకరణుడగు సత్యప్రియుఁడు సుప్రసిద్ధమై శృంగారరసప్రధానమై ఆంధ్రప్రపంచకావ్యంబులలో నొకటియై పెక్కండ్రచేఁ బఠియింపఁబడు వసుచరిత్రయందుఁగల, యీ,

మ. ననుశ్రీరామపదారవిందభజనా-నందున్ జగత్ప్రాణనం।
దనకారుణ్యకటాక్షలబ్ధకవితా-ధారాసుధారాశిసం।
జనితైకైకదినప్రబంధఘటికా-సద్యశ్శతగ్రంథక।
ల్పనుసంగీతకళారహస్యనిధిబి-ల్వంబంచిపలెక్కొంగ్రపన్॥

అనుపద్యమునైనఁజదివియుండలేదుగాఁబోలును.

3. ప్రస్తుతము మంజువాణీపత్రికలో ముద్రింపఁబడుచున్న సర్వలక్షణసార సంగ్రహమునందు, కూచిమంచితిమ్మకవియొక పద్యంబునతానురచియించిన గ్రంథములపేర్లనుడివి, పిమ్మట—

"గంద।

రాడపురసంస్థితుఁడఁగడుప్రౌఢ నేను।
దిమ్మకవిచంద్రుఁడనుజగద్వినుతయశుఁడ॥"

మ॥రా॥రా॥ రాయబహద్దర్ కం॥ వీరేశలింగంపంతులుగారు. రసికజనమనోరంజనప్రబంధగద్యలో.

"నిర్వచననిరోష్ఠ్యనైషధమహాకావ్యరచనాచాతురీధురంధర" అనియు,మ॥రా॥రా॥వడ్డాదిసుబ్బరాయకవిగారు, శ్రీసూక్తివసుప్రకాశికగద్యలో,

"శ్రీపరమేశ్వరవరప్రసాదసమాసాదితసరసకవితాధురంధర"

అనియును,

కవికర్ణరసాయనగ్రంథకర్తయగు సంకుసాలనృసింహకవితద్గ్రంథమున,—

"యతివిటుఁడుగాకపోవుపెట్లస్మదీయ।
కావ్యశృంగారవర్ణనాకర్ణనమున,
విటుఁడుయతిగాకపోరాదువెసమదీయ।
కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున"

అనియు,—

బిల్వేశ్వరీయకృతికర్తలగుబ్రహ్మశ్రీ॥ మ॥రా॥రా॥కొక్కొండ వేంకటరత్నం శర్మగారు,

"క॥ కలదిందుద్రాక్షదఱచుగఁ। గలవిటముక్కంటిపండ్లుకదళీఫలముల్। వల సినవెల్లనుజేకొనుఁ। డెలమిరసికులారయలరుఁడీకృతిదోటన్॥"

ఇట్లొక్కరననేల? పేరుపడసినసంస్కృతాంధ్రకవులెల్లరును, వారివారికావ్యములయందీవిధంబుననే వ్రాసియున్నారు. వారినందఱిని నాత్మశ్లాఘ్యులుగాగ్రహించి వారలకవిత్వమప్రశస్తముగా భావించుటచేత నేగాఁబోలు నీసత్యప్రియుఁడు ప్రభాకరకవిగారినిదూషించెడిమిషమీఁద, కవిలోకమునెల్ల నుదూషించుచుండెను,పాపమిందుచేకవిజనద్వేషియైలోకద్వేషి కావలసివచ్చెను.

౪. గానామృతమునుగురించివ్రాయుదానికిజవాబు.

౧. చిన్నపొత్తము ౨. నిరుపయోగము.

చిన్నపొత్తమనుటకు.

గీ॥ గ్రంథము బహుళమగుట నేగణనగను నె।
స్వల్పమగుటను సత్కీర్తి యల్పమగు నె।
ధీవిశాలురుసారము దెలియఁగలరు।
ప్రేలరులు బాగుగనకయె ప్రేలగలరు॥

క॥ నోరత్తి సభలఁబలుకఁగ।
నేరనిపలు గాకిమూక నేర్పులకెటులీ।
సారము దెలియునుగ దుశ్శ్రం।
గారవిశిష్టమిది పడదు గాదుష్టులకున్॥

(౭) గోరంతలు కొండంతలు జేసి నుతించుట కవులకందఱికిని స్వభావమని తొల్లి నుడివియుంటి. కానఁ బ్రభాకరరావుగారును కవులే గావున వారలిందు నిందార్హులు కానేరరు. మఱియుఁ గవుల కల్పనావిశేషమాధుర్యంబులు కవులకే గాక సామాన్యులకె ఱుకపడవు. ఎట్లనఁ గాళిదాసు భోజమహారాజుతో నిటులనుడివె.

"శ్లో॥ అధరస్య మధురిమాణం కుచకాఠిన్యం దృశోశ్చ తైక్ష్ణ్యంచ।
కవితాయాః పరిపాకం హ్యనుభవరసికో విజానాతి॥" అని.

ఇట్లుండఁ గవితాప్రసంగ మేమోయెఱుంగని యీసత్యప్రియునకుఁ బ్రభాకరకవిగారి కవితారసజ్ఞతయెట్లు బోధపడును. ఇదియెంతయు నసంభవముగదా. మఱియు భోజరాజుగారు,

"శ్లో॥ సంచింత్య సంచింత్య జగత్సమస్తం త్రయః పదార్థాః హృదయప్రవిష్టాః।
ఇక్షోర్వికారాః మతయః కవీనాం ముగ్ధాంగనాపాంగతరంగితాని॥"

అనినుడివియుండిరి. కావునఁ గవితావైచిత్ర్యమింతయని నిర్ధారణఁ జేయుటకలవడదుగదా

(౮) "మంజువాణికిని సమానమున్నె" యనువాక్యము చింతామణ్యాదులఁ దిరస్కరించుటకాదు. దినదినప్రవర్తమానములై తేజరిల్లి సత్కీర్తి వడయు వాటికన్నఁ ఘనత నుడివిన నీమంజువాణికిఁ గొంతఖ్యాతి గలుగవచ్చునని యభిప్రాయము దీనికుదాహరణము.—

శ్లో॥ అధరం కిల బింబనామకం। ఫలమస్మాదితి భవ్యమన్వయం।
లభతేధరబింబమిత్యదః పదమస్యా రదనచ్ఛదం దధత్॥

౯. అతిశయోక్తి నివర్ణించుట కవులకు సహజమని తొల్లి నుడివియేయుంటిని. కాన ప్రభాకరకవిగారు శ్రీరాజాభుజంగరావుగారిని సార్వభౌములని నుతించుట తప్పుగాదు. భుజంగరావుగారు తమ్ముఁదాము స్తుతిఁ జేసికొనలేదు. చేసికొనినను వారునుకవులేగాన వారును నిందార్హులుగా నేరరు. ప్రభాకరకవిగారిని శ్రీరాజాభుజంగరావు

బహద్దరుగారు కవిసార్వభౌములనినుడివియుండలేదు. నుడివిననుగవిస్తుతి తప్పుగాదు. కవులలోఁ గూచిమంచితిమ్మకవితనకు దానె కవిసార్వభౌమ శబ్దప్రయోగము జేసుకొనెను.

ప్రస్తుతాంశములోఁ బ్రభాకరకవిగారు వారి కవిత్వమాధుర్యమును గొనినంతవఱకుఁ గవితాకన్యావృణీతలు గాఁదలఁపఁబడుదురు. ఏలయన;—

కవితాకన్య యట్టియలంకారశాస్త్రజ్ఞుల బరిగ్రహణ మొనరించుట వింతలా? ప్రతిపదవిశిష్టాలంకార పద్యరచనాస్వభావంబున నాతండెవన్నె కెక్కె. కాన నాతండామె నుస్వీకరించెననుటకు సందియము లేదు. ఏలయన;—

శ్లో॥ "కావ్యాలంకరణజ్ఞమేవ కవితాకన్యా వృణీతే స్వయం" అనియుండుటచే.

(౯) తిక్కననునిరసించడము విషయములో శోచనీయమనుదానికి.

తిక్కననునిరసించనులేదు. తిక్కన తిక్కవిడిపించు విషయములో నలంకారమిదివఱకే వ్రాయఁబడియుండెను. కనుక శోచనీయమైయుండినఁ దత్కార్యమొనరింపవలెంగాని తన్నివారణము నాచేఁ గానేరదు.

(౧౦) వారుస్వయముగా బిరుదుపద్యాలు చెప్పుకొనిరటనుకు వారటులఁ జెప్పికొననులేదు. చెప్పికొనినఁ బూర్వోద్దిష్టకవులతోటి పాటివారే యగుదురు.

(౧౧) వారివర్ణనలు స్వభావవర్ణనలనుటకు,-

వారివిస్వభావవర్ణనలని యెచ్చటను వ్రాసియుండలేదు. "ఈరీతి స్వభావోక్తిని" అనువాక్యములనర్థంభ్రంశముగలవాఁడై స్వభావవర్ణనలని వ్రాసినట్లు గ్రహించెను. స్వభావోక్తియనఁగా, నాశుధారాదివర్ణనము, తద్వ్యతిరేకము ప్రౌఢోక్తి.

(౧౨) శ్రీరాజాభుజంగరావు బహద్దరుజమీందారుగారి పుస్తకభాండాగారములో వేదములు లేవనుటకు.

వేదంబులందుఁగలవు. వేదంబులనోటిపాఠముగ వర్ణనఁ జేయవలసినదే కాని వ్రాఁతపూర్వకముగా నుండవనియాతని యభిప్రాయము. స్వరసంసిద్ధికొఱకు గురూపదేశముగ సంతలు చెప్పుకొని వర్ణనపుస్తకములతోఁ జేయుదురు. తైత్తిరీయసంహితభాష్యము అనఁగా వేదార్థప్రకాశిక. ఇది వేదసంబంధము కానేరదా?

(౧౩) తాను శ్రీరాజాభుజంగరావుగారి పుస్తకభాండాగారములోనున్న వేదములనభ్యసించెదననుటకు.

కృతఘ్నత విడనాడి కృతజ్ఞతవహించివచ్చినను రావచ్చును. వారియనుగ్రహము సంపాదించినను సంపాదించవచ్చును. కాని "యఱువదియేండ్లువచ్చి చదువుకొనకమ

న్నుఁగొట్టుకొనా" యనుసామెత్యనుసారంబుగ నీవయస్సునకు వేదమువచ్చునాయని సందేహము.

(౧౪) స్మృతులకుశాస్త్రములకు, కావ్యములకు నాటకములకు భేదమేమియనుటకు.

స్మృతియనఁగా, మనుస్మృతి, వైద్యనాథస్మృత్యాదులు స్మృతియనఁగావిధినిరూపణ. ఉదాహరణమెట్లన,

"శ్లో॥ ప్రాశ్రితస్నానేనశుద్ధాస్యుః। ఏపిపాపకృతోజనాః; తస్మాత్సర్వప్రయత్నేన। స్నానంప్రాశ్రితస్సమాచరేత్॥" అని,

శాస్త్రములనఁగాఁ దర్క-వ్యాకరణాదులు. అవిలోకసుప్రసిద్ధము లగుటంబట్టి వానినివేఱె చేర్కొనఁబనిలేదు.

నటనార్హంబులగు ప్రబంధములనాటకములనివాడెదరు. కావ్యంబులునటనార్హంబులుగావు. కావ్యప్రబంధములకు భేదమెందుగాఁగలదు. కావ్యసామాన్యలక్షణమెట్లన;—

"అదోషౌసగుణౌసాలంకారౌ, శబ్దార్థౌకావ్యమితి కావ్యసామాన్య లక్షణం" అని,

ప్రబంధలక్షణమునకు దాహరణము.

"శ్లో॥నగరార్ణవశైలర్తుచంద్రార్కోదయవర్ణనం।
ఉద్యానసలిలక్రీడామధుపానరతోత్సవాః।
విప్రలంభోవివాహశ్చకుమారోదయవర్ణనం।
మంత్రద్యూతప్రయాణాజినాయకాభ్యుదయాఅపి" అని.

కాననేతత్రయగ్రంథనిరూపణార్థ మీశబ్దంబులఁబ్రయోగించెను.

(౧౫) ప్రభాకరకవిజగమంతయు శోధించెఁగాఁబోలుననుటకు.

వెఱుగుర్తెఱింగిన సమస్తాంధ్రప్రభువులందఱిలో శ్రీరాజాభుజంగరావుబహద్దరుగారు పుస్తకభాండాగారమేర్పరచిరనినుడివిరిగాని ప్రభాకరకవిగారుప్రభాకరునివలె జగమంతయుశోధించినారనియనలేదు. కాని, ఈసత్యప్రియుఁడొరులవ్యర్థాలోపంబులనారయుటలోద్వాదశ. ప్రభాకరుఁడనుటకుసందియములేదు.

(౧౬) "హూణభాషాభ్యాసమొనరించి యాంగ్లేయదొరలతోనొకయెత్తుతూగినాడ" ఈమహదావస్థతటస్థించినప్పుడు—అనుటకు.

వారికటువంటిమహాదశలుసంప్రాప్తించినవనుటకు సందియములేదు. అదిసాంబుగగుర్తెఱుంగక పరిహసించునీసత్యప్రియునికి మహదవస్థగానివారికిగానేరదు.

(౧౭) పరదారకుమారు విచారశేముషీదూరుఅనుదానియర్థమడుగుటకు.

పర=పరులయొక్క,దార= భార్యలకు, కుమారు= కుమారునివంటివాఁడును.విచార=సంకోచమనెడి, శేముషీ=బుద్ధికి, దూరు=దూరుఁడైనవాఁడును; అనియుమఱియు, "పరదార" అనుటకులక్ష్యము.

"క॥ పరదారగమనమొప్పదు।
పురుషునకదియెల్లపాపములకంటె"

"భారతము"

అనియుఁదెల్పుచున్నాఁడను

(౧౮) పలుసారులు"తిక్కనకుఁతిక్కవిడిపించు తెలివిగలఁడు" అనుపాదంబునుచ్చరించు సత్యప్రియునితిక్కయేలూరువచ్చితద్గ్రంథంబు సాగ్రంబుగ నేర్చుకొనినతీరుననిమాయాశయము.

దేవరకొండమాణిక్యముగారు.

పరాసహనాజ్ఞానజననీతిప్రభోధము.

గీ॥ నిరపరాధులుసరసులునీతిపరులు।
మెఱయఁగనలేమిఁగన్నులఁగొఱవులునిచి।
కొనుచునీచులుతారెసంహననమైన।
మేలుగనలెరెసత్కీర్తిపాలుగాదె॥

గీ॥ సరసనక్షత్రప్రభలెఱుఁగకచంద్రరేఖఁ।
జూచిమొఱుఁగిడిశ్వానముసొక్కుపగిది।
తారతమ్యంబువిడనాడితగవులూను।
నీతిదూరులకెల్లెడనీరసంబు॥

సీ॥ ఒరులసంపదఁజూచి-యోర్వలేమినడంగఁ,
దెల్లమరపుజేయు-గ్రుడ్లఁగలిగి।
నిరపరాధులనెల్ల-నింద్యులగావ్రాయఁ,
గరశాఖలెల్లవం-కరలనొంది।
హృదయసీమవెలుంగ-నీర్ష్యాగ్ని చేమేను,
వాడినెమ్మోమున-మాడుతోఁచి।

తలకుఁ దాటినయట్టి - తలఁపుల సమకట్టి,
యిల్లువాకిలి నెల్ల - గుల్ల జేసి।

గీ॥ ఆలుబిడ్డలమాపమాన్యంబులమ్మి।
పలు తెఱఁగుల నూరూరఁ జీవాట్లఁ బడుచు।
నిలుకడలు వీడి మూర్ఖుఁడు నీతివిడచి।
పరులపంచల పాలయి బ్రతుకుచుండు।

సీ॥ తలఁచ సామ్యంబు సి - గ్గుల చేటు గాకున్న,
నిక్కి - ఢీకొనవోరు - నొక్క లేరు।
మూర్ఖునితో నేమి - ముచ్చటలనకున్న,
జెంపలరెండు - వాయింపలేరు।
పరువెఱుంగనివారి - భాషణమనకున్న,
జుట్టుకాలిని దొక్కి - పట్టలేరు।
స్వల్పులతో నేమి - సరసంబులనకున్నఁ,
గొంపనుగుండమే - యింపలేరు।

గీ॥ ఇంపుగాదని వారి వారింపలేరు।
గానలోకమందున బుద్ధిగలిగిఘనుల।
నల్పులు విశేష గౌరవమందఁ జేసి।
యున్న మట్టు కుదిని పడియుండ మేలు॥

గీ॥ అరసి దేవరకొండకులాబ్ధిచంద్రుఁ।
డైన మాణిక్యకవియిట్టులమితధృతిని।
పరుల శ్రేయస్సుఁ జూచి చెడిఫక్కిఁ గోరి।
నీతిపద్యాలరచియించె నెమ్మిఁ గనుడు।

శశిలేఖాసహానము.

ఆ ౧౯౧౨ సం॥ సెప్టెంబరు ది ౨౦ం తేదిగల శశిలేఖ బ్ర॥మ॥ శ్రీ రాజా మంత్రిప్రగడ - భుజంగరావు బహద్దరు వారివలనఁ బంపఁబడిన „కవిరాజసందర్శనము'' „మంజువాణి'' అను గ్రంథద్వయముపై తనయాశయము వ్యక్తీకరించినది. అందు మొదటి గ్రంథముపై నీయంబడిన యభిప్రాయము సత్యప్రియుని పేరటను, రెండవ గ్రంథముపై నీయంబడిన యభిప్రాయము పత్రికాధిపుని పేరటనే యీయంబడినట్లు కాన్పిం

చు. అయిననీ రెంటిలో సూచించఁబడిన యసూయయొక్క విధముగానే ప్రజర్విల్లుట చేత నీరెండునొక్కరివలననే వ్రాయంబడియుండు. లేదా యొక్క విధమగు నూహలు గలగురుశిష్యుల చేతనైన వ్రాయంబడియుండు.

శ్లో॥ దహ్యమానాః సుతీక్ష్ణేన। నీచాః పరయశోగ్నినా। ,
అశక్తాః తత్పరంగంతుం తతో నిందాం ప్రకుర్వతే॥

అనియున్న బుధజనోక్తి యిచ్చోటనెంత లెస్సగాఁబట్టినదో చూడుఁడు. „కవిరాజసందర్శనము'' అను గ్రంథమును మేమందఱ ముంజదివినారము. కాని సత్యప్రియునకది గల్గించినంతగాని కొంతగాని విచారముగాని యసూయగాని మాకుగల్గించలేదు. దానినిలోకములో ధనాపేక్షులగు కవులు సామాన్యముగాఁ జేయు యత్నములలో నిదియొకటిగా భావించి దానిలోని గుణము మాత్రము నే గ్రహించి యుంటిమి. ఇఁక సత్యప్రియునకో, అది నేత్రమార్గముగా హృదయములోఁ బ్రవేశించి హృదయగ్రంథిబగిలించి లోపలనుండు పరశ్రేయస్సహనమును మహోత్కృష్టపదార్థము నింకించి వైచినది. దానిపయింబుట్టిన మహావ్యాధికి ఫలముగా నీప్రస్తుతోపన్యాసము గలిగినది. పైత్యరోగికి పాలు చేదుగఁదోఁచునట్లును మాటలలోఁ బొరపాటు—కల్గునట్లును, వికృతచేష్టలు గలుగునట్లును సత్యప్రియుడుగారికిఁ గూడ బ్రస్తుతములోఁ గల్గిన పైత్యభ్రమవలన వస్తుతత్త్వపరిజ్ఞానము నిల్చిపోయినది. లేకున్నచో „స్మృతులకును శాస్త్రములకును భేదమెద్ది? ప్రబంధములును నాటకములును కావ్యములు కావా? కావ్యంబులని వేఱ చెప్ప నేల?'' అను సంప్రశ్నములఁ జేసి తన తెలివిహీనతం దేశమునకుఁ దెలియునట్లు పత్రికాముఖంబునఁ బ్రకటించునా? ఇతని కావ్యనాటకశాస్త్రసాహిత్యము వేరా? ఇట్టి మహాపండితుఁడు శశిలేఖాపత్రికాధిపునకు గురుఁడో శిష్యుఁడో కాకున్నచో నతని వాక్యములే శిరసావహించియతఁడు ప్రకటించునా? ఏమి యీయిర్వురి పండితుల ప్రజ్ఞావిశేషములు. స్మృతులని పిలువంబడు మన్వాది ధర్మశాస్త్రములకును తర్కవ్యాకరణాది శాస్త్రములకు భేదము వీరిమనస్సులకు గోచరించలేదఁట. అరెంటి భేదముం దెలియని వీరికి ప్రబంధములకు నాటకములకుండు భేదములు తెలియకపోవుట యాశ్చర్యముగాదు. అవి యన్నియుఁ గావ్యములేయఁట. కాళిదాసకృతములలోఁ గావ్యత్రియమని యున్న వాటికర్థమెద్దియో యోచించుకొమ్మని వీరికిబోధించెదము. నాటకప్రధానాంశములఁ దెలియని యీపండితులకుఁ గావ్యములకుఁ బ్రబంధములకు గలభేదము లరయుమని చెప్పినలాభము లేదు, వీరు 'పునఃపూజాంకరిష్యే' అనునట్లు మఱల మొదటినుండియుఁ దమరీవరలోనభ్యసించి మఱచినయంశముల నేర్చుకొమ్మని చెప్పుటకంటె నిపుడు చెప్పవలసినది లేదు.

ఇఁక భుజంగరావుగారు పుస్తకభాండార ముంచినందున నది మనదేశస్థులలో పెక్కండ్రు చేయలేనిపనియని ప్రభాకరకవిగారు నుతింతుటయొక తప్పఁట. దీనిలో భుజంగరావుగారి పుస్తకభాండాగారము సంపూర్ణమయినదియని ప్రభాకరకవిగా

రువర్ణించలేదే? విజయనగరప్రభువులుంచినట్లుగానే భుజంగరావుగారునొక భాండాగారముంచి తన్నిమిత్తమైయనేక గ్రంథములసంపాదించుచున్నారనియు నిది జమీందారులకెంతయు గౌరవనీయకార్యమని శ్లాఘించిరి. అట్టిశ్లాఘన సత్యప్రియునిగారికి శ్రుతికటువుగాఁ గాన్పించి యదిదోషముగా గ్రహించిరి. దీనికిఁగారణము వారి సత్యప్రియత్వమో లేక పరశ్రేయాసహిష్ణుత్వమో నిర్ణయించి పాఠకులందఱు సత్యప్రియునిగారికి విన్నవించుటయెకాక యింతటినుండి వారినిమారుపేరునఁ బిల్చుటయే న్యాయమని నిర్ణయింపఁ గోరెదము.

ఇఁకపైపుస్తకభాండాగారమునందు వేదములుజూచియుంటిమని ప్రభాకరకవిగారువచియించిరని సత్యప్రియుఁడుగారు తమకువేదమునందుఁగల యాదరముం దెల్పుచున్నారు. వేదము ఋగ్యజుస్సామాథర్వణంబులను నాల్గుభేదంబులతో నొప్పియుండునని సత్యప్రియుఁడుగారుచెప్పిన మాటయొక్కటే వారికినాల్గువేదములంగూర్చిన సంపూర్ణజ్ఞానమునుసూచించు. ఇట్లుండఁగానీపుస్తకభాండారములోవానింజూపినయెడలఁ దావానింజదువుటకు సర్వసిద్ధుఁడై యున్నాఁడఁట. ఏమియీ సత్యప్రియుని యవివేకము! వేదములుపుస్తకములంజూచి యభ్యసించిన దోషము గలుగునని చెప్పంబడియుండు శ్రుతినివీరెఱుఁగరు కావలయును. తెలిసిననిట్టికోర్కెతమకుఁ గలదని తెల్పి తమశాస్త్రజ్ఞానహీనత నేలవెల్లడించుకొనిరి. ఈకారణముననైన వీరికివేదాభ్యాసంబు సేయబుద్ధిపొడమినందులకు సంతసించెదము. ప్రస్తుతములోవీరియభ్యాసమునకుఁ దగు ఋగ్యజుస్సామభాగములు శారదానిలయమందుఁగలవు. అవి చదువుకొని, ఆథర్వణాపనయము జేసికొనివచ్చునాటి కాథర్వణ వేదముంగూడ శారదానిలయంబున లభియించఁగలదని విశదీకరించెదము. ప్రభాకరకవిగారు తమకవితామాధుర్యమును బద్యరూపముగానే చెప్పియున్నారు. వీరువేరే కావ్యమా కావ్యమునకుఁగాఁ జేయనవసరముండదు. కాని సత్యప్రియుఁడుగారు తమకుఁ గవితాసామర్థ్యమే యున్నచో నీప్రస్తుతోపన్యాస మేలపద్యరూపముగా నొనరింపలేకపోయిరో! వీరీయర్థమును బద్యములలో రచియించులోపల ప్రభాకరకవిగారు ప్రబంధమునునిర్మించుట చేతగాకయున్న నభ్యసించెదరుగాక.

ఇఁక "తిక్కనకుఁదిక్కవిడిపించు తెలివి" అనుదానింగూర్చి ముచ్చటించెదము. దీనినీసత్యప్రియుఁడుగారు దోషవర్ణనముగా గ్రహించుటంజేసి వీరాలంకారికులుకారని స్పష్టమేయగుచున్నది, సామాన్యముగా నొక స్త్రీముఖముచంద్రునిదిరస్కరించుచున్నదియని చేసినవర్ణనములో ముఖవిషయికమగువర్ణనయదియగుంగాని చంద్రునియెడదోషాపాదిగాదే! ఆసామ్యమేలవీరిమనస్సునకుఁదట్టలేదో? దానికిఁగారణము పైనమనమువివరించినయసూయయే. ఇట్టియసూయాపరులతో సమాధానము నుడువుటయర్హకృత్యంబుగావనిచెప్పి మఱల పైశ్లోకము నేయుచ్చరించిప్రస్తుతమదినిల్పెదము.

పత్త్రికాధిపతిప్రాగల్భ్యత

ఇంతవఱకుమపవిలేఖకుని ప్రజ్ఞావిశేషములఁజెప్పినారము. ఇఁకపత్త్రికావిలేఖకులవిశేషములఁజెప్పుచున్నారము. "అతనికంటెఘనుఁడుఆచంటమల్లన్న" అన్నట్లుగా నుపవిలేఖకునిమించినయసూయను బత్త్రికాధిపతిచూపుచున్నాఁడు. పత్త్రికాధిపునికంటెఁగొంచెముపవిలేఖకునికే యుపక్రమోపసంహారములమార్గము తెలిసినట్లుగాఁ గాన్పించు. ఎట్లన్నను;--

"దేశభాషలుక్షీణించుచుండునీకాలములో నాంధ్రదేశమునలంకరించియుండు నిజమీందారుగారు, కవనముచెప్పఁగలిగినంతపాండిత్యముగలవారై, దేశాభిమానులై వారికి గలిగియుండు నుపపత్తులవలనఁ బ్రజలకుపయోగపడుకావ్యములు సేయవలయునని సమకట్టుటెంతయు శ్లాఘనీయమైన కార్యమనుటకెంతయు సందియము లేదు"—అని.

ఇట్లుగావ్రాసిన సాముదాయకాభిప్రాయము వివిధవిషయములక్రిందనీయంబడినయభిప్రాయములతోఁగలసియుండదు. వానిసమాధానములను వేఱువేఱుగాఁజూపఁదలఁచియున్నారముగావునఁ బ్రస్తుతముపసంహారక్రమముం బ్రదర్శింపనుపసంహరించెదము.

(౧) "విక్టోరియాతారావళి వీరిదివఱకేముద్రించియుండుటంజేసి పదంపడి యీపంచికలో దీనిఁజొప్పించిన దంతమంచికార్యముకాదు. చర్వితచర్వణముగనున్నది" అనిఈగ్రంథము శ్రీవారుముద్రించుటకుఁగా గారణముతమరాజవిశ్వాససూచకముఁగ జేసిరని పత్త్రికాధిపతులేవ్రాసియుండిరి. కావుననీవిషయమైమనమువిశేషించివ్రాయనక్కఱలేదు.

(౨) శృంగారరసప్రవాహినీవిషయము. దీనిలోనిశృంగారరసమువలనఁ బాఠకులునీరసులగుచున్నారుగానిసరసులగుటలేదఁట. భారతాదిగ్రంథములలోనిశృంగారరసములనే యీకాలములోనియధికారులుమట్టుపరుచుచున్నారఁట. కావుననవీనగ్రంథకర్తలీరసమునుమట్టుపరుచుటమంచిదియని పత్త్రికాధిపతులయభిప్రాయము- దీనిలోఁదేలిన సిద్ధాంతానుసారమింతటినుండి శృంగారరసముపనిసరి. పాఠశాలలో విద్యాభ్యాసముజేయుబాలురకు శృంగారరసముబాల్యములో నేయభ్యసించుటకల్గున నిప్రభుత్వమువారు భారతాదులలోనుండు శృంగారపద్యములఁగొంతతగ్గించుటకుయత్నించిరిగాని పత్త్రికాధిపునియభిప్రాయానుసారముగాఁజేయలేదు. అటులనేయైనచో సర్వకళాపరీక్షలలోనిదివఱకును జదువంబడుచువచ్చిన వసుచరిత్రాదిగ్రంథములు శృంగారరసప్రధానకావ్యములు కావనిచూపించుపని పత్త్రికాధిపునియందేయుండును. శృంగారరసముజదివినీరసులగువారుండునెడల వారిశృంగారరసముపయోగించి బాగుచేయుఁడని తెల్పెదము.

3.మూఁడవయాక్షేపణము. కాకమానిమూర్తికవి, అడిదముసూరకవి, కూచిమం

చిలిప్మకవి, వడ్డాదిసుబ్బరాయకవి, వ్రాసినగ్రంథములు ప్రచురింపఁబడుటచేమేలు హెచ్చుగలభించదఁట. దీనికిఁగారణము, అముద్రితగ్రంథములఁబ్రకటించుటకు, తన్నామకచింతామణియు, జింతామణియు, వైజయంతిమొదలగుసాధనములేర్పడియుండుటయఁట. ఆహా! ఏమియిచ్చోపత్రికాధిపతి బుద్ధియింతయుక్తిహీనమై యతనికిఁగల యౌర్వలేమినెట్లుగావెల్లడించుచున్నది! పైనవివరించినగ్రంథములేసాధనములుగానేర్పడినవఁటగాని ‟మంజువాణి” అట్టివానికిసాధనముగాఁగూడదఁట. ఆంధ్రములో నిన్నియముద్రితగ్రంథములున్నవియనియు నాగ్రంథములనుమేమీవిధముగాఁబంపకము జేసికొని యచ్చువేయించెదమ పైపత్రికలుశపథముంజేసియుండలేదే! ఈగ్రంథములన్నియునచ్చుపడువఱకు నాపత్రికలుచందాలురాకయున్న నిలువఁబడగలమనిచెప్పియుండలేదే? అవియన్నియు‟యావత్తైలంతావద్వ్యాఖ్యాన” మనునట్లుగాఁజందాలు దొరికినంతవఱకే నిలువఁబడఁగలవిగాని అన్యత్ర నిలువఁబడఁగలయట్టి యుపాధులతోలేవే. ‘మంజువాణి’ అట్టిభిక్షుకస్థితిలో లేక స్థిరవసతితోనిల్చి గ్రంథములఁ బ్రకటించుటయొకదోషముగాఁ బత్రికాధిపునకేలతోచెనోమేమూహింపలేకయున్నాము. చెన్నపట్టణములోఁగాని. అన్యస్థలములలోఁగానివార్తాపత్రికలులేకపోవుటంజేసి కావలయును. ‟శశిలేఖ”బయలువెడలినది. ఈపత్రికవలనభాష నేర్చుకొనువారల కెట్టిశబ్దజాలముదొరకుచున్నదో యాంధ్రలోకమునకేతెలిసియున్నది. ఇట్టియాభాసతెలుగుతోఁ బ్రకటించుచున్నపత్రికయంతగా నాంధ్రదేశములోఁ బ్రసిద్ధులయిన ప్రాచీననవీన కవులకావ్యములను ‘మంజువాణి’ ప్రకటించుటయొక గొప్ప లోపమే గదా

(౪) అప్పయ్యదీక్షిత చారిత్రముంగూర్చి. బ్ర॥ గు॥ శ్రీరామమూర్తిగారిచే బ్రకటింపఁబడుచున్న అప్పయ్యదీక్షిత చరిత్రమునకు దోషమెద్దియనఁగా ‘ఆదిశంకరులు, రామానుజాచార్యులు, వేదాంతదేశికులు, మొదలగువారిజీవితములు విశేషముగాఁ బుక్కిటిపురాణములతో మిళితములైయుండును. నిజమిట్టిదని విశదపడలేదు. అని. ఏమియీపత్రికాధిపతిగారి యుక్తిపరంపర. వాక్యరచనావిశేషము, సందర్భశుద్ధి, ఈవాక్యములతో నాయంశమునుముగించి, పేరాకూడాముగించిరి. క్రొత్త పేరాలోఁ బ్రారంభింపఁబోవు సంగతులకును, బ్రాఁతపేరాలోనుండు సంగతులకును గలభేదము లాంధ్రభాషలోఁ జెప్పశాస్త్రములేకున్న నాంగ్లేయభాషలోనుండి యీసంజ్ఞలవలంబింపఁబడిన వగుటంజేసి యందేమి వ్రాసియున్నదో చూచి వాక్యరచనలోనీగుర్తులుంచి యన్యులనాక్షేపింపఁ గడఁగుఁడని పత్రికాధిపునితో విన్నవించెదము. మతవిషయముగా సంభావించినను అప్పయ్యదీక్షితులవారి చరిత్రమువలనమనకుఁగలుగగల మేలెద్ది? అనివీరొక వాక్యరచనచేసినారు. దానికిసమాధానమిప్డే చెప్పవలయునాయని యోచించుచున్నారము. గ్రంథమంతయుఁ జదివినపిమ్మటనాగ్రంథమునకు ఫలమేమని యోచించువారుందురుగాని గ్రంథప్రారంభములోఁ గొన్ని పఙ్క్తులుచదివియిట్లు శంకించు పండితులుందురా? ‘గోడా’ యనఁగా గుఱ్ఱమనిచెప్పినతోడనే ‘మదుకు’ అంటే పల్లమనియును ‘తేలు’ అంటే నూనె యనిచెప్పఁగా ‘పాము’ అంటే ఆముదమనియూహించిన హిందూస్థానీ భాషనభ్యసించు మహాబుద్ధిశాలియట్టి వారుగా నీపత్రికాధిపులు కాన్పించుచున్నారు. అదియుండనిమ్ము. వీరికిఁజారిత్రమనఁనెట్టిదో చారిత్రములు చదివినందువలనఁ గల్గుఫలములెట్టివో తెలిసియున్నచో నీచొప్పదంటు శంక వీరికిఁ బుట్టక నేపోవును. తెలియకున్ననువీరు వైష్ణవమతస్థులుగాకయున్న ప్రస్తుతపుబరితాపము వీరికిగలుగకయుండ నీవెఱ్ఱివ్రాతలు వ్రాయించకయుండును. దేశములోనుండువాగ్రూపవ్యవహారములును, స్థలపురాణాదులగు ప్రాఁతతాళపత్రములలో నప్పయ్యదీక్షితుఁడు తాతాచారినోడించి యుండుటంబట్టి దీక్షితచారిత్రము వ్రాయుచు ‘విజయనగర రాజ చారిత్రము’ లోనున్న విధముననీక్రింద వివరించుచున్నాఁడనని శ్రీ॥ వారుగ్రంథారంభములో వ్రాసియున్నారు. అట్టి వ్రాఁతలనైనఁ జివరవఱకుఁ జదువక, అవియైనపిమ్మట నాగ్రంథకర్తవలన వ్రాయంబడిన యభిప్రాయాదులనైనఁజూడక ‟యీకాలములోద్వైతాద్వైతవిశిష్టాద్వైత మతములలోసారముగలమతమిదియనిసిద్ధాంతీకరించుట యనవసరమైనపనికిమాలిన కార్యమని మాయభిప్రాయమనివ్రాయుట పత్రికాధిపునిబుద్ధిలేమి ప్రకటించుటకాదే? పత్రికాధిపుఁడనుమహాగౌరవస్థానముననుండినవారిట్టితుచ్ఛవాక్కులువ్రాసి తమపెద్దరికముం జెడగొట్టుకుందురా! యనిమాకొకశంకబొడముచున్నది. పార్థసారథిఅయ్యంగారిట్టితుచ్ఛప్రసంగములుసేయువారుకారనియుఁ దమకుసాహాయ్యకుడుఁడుగానుండు యేవీఱడియొక్క వ్రాఁతలనోపరిశీలింపక యిట్లుగాఁబ్రకటించియుందురనితలంచుచున్నారము. ఇనుముంబట్టిఅగ్గికిసమ్మెటపెట్లనునట్లుగా నుపవిశేషకులవలనఁ గల్గుగౌరవాదులు తామనుభవింపకతప్పదుగదా. కావుననింతటితోదీనివ్వదిలెదము.

(౫) వైద్యశాస్త్రముంగూర్చి. దీనింగూర్చి పత్రికాధిపతి వ్రాసినమాటలుబాలవాక్యములవంటివే. మనపెద్దలువ్రాసియుంచిన వైద్యశాస్త్రమెట్టిదియో ప్రస్తుతమచ్చుపడుచున్న వైద్యుతలోహశాస్త్రమెట్టిదియో నేత్రములున్నవారి కందఱకుందెలియుచుండఁగా వీరేలయిట్టి పొరపాటువ్రాఁతలవ్రాసెదరు? ‘వైద్యుతము’ అనఁగా విద్యుత్సంబంధమనియర్థము. విద్యుత్తనఁగా మెఱుపు. దీనితోబంగారుపూఁతలు మొదలగు పనులుచేయంబడును. దీనినిమాత్రలుచేసుకొని మ్రింగుటకైయత్నించిన మనపెద్దల గ్రంథములున్న నడుగుఁడనిచెప్పి యిట్టిగ్రంథములీవఱకు మనభాషలో లేవనియును, వీనినన్యభాషలనుండి మనభాషలోనికిం దెచ్చుచున్న బ్ర॥ మ॥ ద్రోణంరాజు వెంకటాచలపతి శర్మగారికి మనమందఱము కృతజ్ఞులమై యుండవలసియున్నదనియుం జెప్పవలసియున్నది. గ్రంథముయొక్క శీర్షికనయినఁ బరిశీలింపని పత్రికాధిపు లీవఱకాంధ్రులలో లేరనియు నీఘనకార్యరచనలో వీరేప్రాథమికులనియు ముమ్మాటికి వక్కాణించి యాంధ్రభాషకిట్టి యసూయాపరులవలనఁ గల్గుబాధలు తప్పింపసర్వశక్తివంతుఁడగు భగవంతుంబ్రార్థించెదము.

(౬) వ్యవసాయము. ఈగ్రంథవిషయమైయిచ్చిన యభిప్రాయముమఱియు, శ్లాఘనీయముగానున్నది. మనదేశములో విద్య నేర్చినవారికి భూమిలేదఁట. ఈమాటనిలువలేదనిచెప్పుటకు శ్రీరాజావారే ప్రథమనిదర్శన మగుచున్నారు. ఆంధ్ర దేశము

లో నగ్రహారీకులు శ్రోత్రియదారులందఱు బ్రాహ్మణులే సుఁడీ. మాన్యదారులలోఁ బెక్కండ్రు ద్విజులే సుఁడీయున్నారు. వీరిలో విద్య నేర్చినవారికొఱకే యీగ్రంథముద్దేశింపఁబడిన నిది సార్థకమేయగును. ఇఁక భూములుండు రహితుల కక్షరజ్ఞానము లేదను మాటం గూర్చి కృష్ణాగోదావర్యాది మండలములలోని రయితులఁ బరిశీలించిన వారిలో నూటికిఁ పదుగురయిననీ సులభగ్రంథముం దెలిసికొననివారుండరు. ఇఁక జమీందారులును, ముఖాసాదారులును, ప్రొప్రయిటరులు మొదలగు పెద్దభూస్వాములందఱును నిరక్షరకుక్షులనుటకంటె నిట్లువ్రాసినవారొక్కరే నిరుపయోగకుక్షులనఁ బాగుండును. ఇట్లుండ ఉన్నచో వారికి స్వదేశాన్యదేశీయుల వ్యవసాయభేదములుం జెప్పి సులభమార్గములుగానుండు వానిం గొన్ని గ్రంథరూపముగాఁ దెల్పుట నిరుపయోగ మెట్లగునో ఇట్టి యుపయోగశాస్త్రముం గూర్చి నిరుపయోగమని వ్రాసిన బుద్ధిశాలి యుక్తిప్రయుక్తులకు సమాధానములు చెప్పుటకు సిగ్గగుచున్నది.

ఇట్లుగాఁదన యభిప్రాయము మోమోటము లేక యిచ్చితిని నిన పత్రికాధిపతి మాటమే ముగుణముగా నెంచక 'లజ్జామేకాం పరిత్యజ్య త్రిలోకవిజయీ భవేత్' అను న్యాయమునవలంబించి వ్రాసేననియెంచి అతని తక్కిన సంగతులకుత్తరమీయ మానెదము.

'సత్యంబ్రూయాత్ ప్రియంబ్రూయాత్ నబ్రూయాత్సత్యమప్రియం' అని యున్న బుధజనోక్తిం బాటించి యింతటినుండియైన నవీనమహాకావ్య నిరుత్సాహతకయికక్షవహించి నిరుపయోగ వాగ్జాలముం బ్రసరింపనీయక మహోద్యమములకొనసాగింపఁ దగిన వాక్కులే ప్రకటించుట మంచిదనియు లేనియెడల 'మౌనమపండితానామ' నియున్న మహావాక్యము నాశ్రయింప వలయుననియు హితము జెప్పెదము.

ప్రతిపీరవిదారి.

కువిమర్శకచోరశృంఖలము.

ఆంధ్రభాషాభిమానులారా!

* మనదేశంబున నిపుడాంధ్రభాష క్రమంబుగ నభివృద్ధి నందుచు నెల్లెడ వ్యాపించుచున్నదను సంగతి యందఱకును దెలిసియేయున్నదికదా భాషాభివృద్ధి పెక్కులగు గ్రంథరాజంబులు వెలువడుచున్నఁగదా కావలసియున్నది. గ్రంథంబులు విశేషించియున్నను విమర్శనాలోపములగు కావ్యములు భాషాభివృద్ధికిఁ దోడుకానేరవుగదా. ఇట్టిస్థితిలో గ్రంథవిమర్శనము లెంత లోకోపకారములగునో తెలియకుండునా? కానియీ విమర్శనము సువిమర్శనము, కువిమర్శనమని రెండువిధములుగా నుండుటం బట్టి మనభాషకు చిక్కులు మిక్కుటముగఁ దటస్థించుచున్నవి. అట్టిలోపమును బాపుటకు భాషాభిమానులందఱును దగుప్రయత్నములొనరించి, కువిమర్శనముల రూపుమాపి సువిమర్శనముల దేశమున వ్యాపింపఁ జేయవలెను. ఇట్టి భాషాభిమానులలోఁ బ్రప్రథమమున బ్ర॥ కాశీభట్ల బ్రహ్మయ్యగారు,—

చ. తరచికదాసురాసురవి-తానము గాంచిరి సంద్రమందు సుం।

దరతరవస్తుసంతతులఁ-దప్తము జేయఁగదా వెలుంగుబం।
గరువునవన్నెపుట్టెడును-గాదె దధిక్షమధియింప వెన్నయా।
కరణి విమర్శనంబునన-కావ్యవిశేషములుద్భవిల్లెడిన్॥'' అని నుడివియున్నారు.

ఇప్పుడు రెండవతరగతి విమర్శకులు పలువురు బయలుదేరి మొదటితరగతి విమర్శకులఁ జెరుపఁబ్రయత్నించుచున్నారు. ప్రయత్నించినంత మాత్రమున నట్లు జరుగునా? ఎందును న్యాయస్థులే గదా జయముంబడయుదురు. కవివర్యులును బండితులును సువిమర్శకులునగువారు గుణదోషంబులరెంటిని సమానహృదయముతో 'విడదీయ వలసినవారుగానుండ నిప్పటి కవిరాజుసందర్శన మంజువాణీ విమర్శకులొక్క వ్యర్థదోష విమర్శనమునకే గడంగుటం జూడ రెండవతరగతి విమర్శకులనుటకు సందేహము లేదు.

వీరిలో నొకరగు సత్యప్రియుఁడుగారు చేసిన విమర్శనమెంత తెలివిగానున్నదో వారికే చూపఁదలంచి వ్రాయుచున్నాను. ఎట్లన,—

ఓ సత్యప్రియుఁడా! శశిలేఖను నిత్యంబును గరంబున నలంకరించుకొని ప్రమోదభరితస్వాంతులగుచున్న యాంధ్రమహాకవులందఱును నపూర్వాలంకారములతోడ నొడలు సింగారించుకొని యాంధ్రదేశంబున శృంగారరసప్రవాహమును బ్రవహింపనుత్సహించెడు మంజువాణిని ముమ్మాటికిని సందర్శించియేయున్నారు. 'అప్పత్రికారత్నమునకు' దిక్కునకుఁ దిక్కువిడిపించు తెలివిగలఁడట్టి కవిరాజుచేత——చక్కఁగఁ జాటుచున్నదికదా' యనియేమో వింతపడితివి. ఆహా! మిక్కిలి చాటుచు నే[illegible]ది. మఱియుఁ, దిక్కునకుఁ దిక్కువిడిపింపఁగల కవిరాజులవలన సార్వభౌమత్వమును——యేమనికొనియాడఁగలమంటివి. కాకేమి? ఇట్టి కవిసార్వభౌములచేతను రసికాగ్రగణ్యులచేతను గౌరవము రాకపోయిన నీవంటి సత్యప్రియులచేతం గాఁబోలు నాంధ్రవధూటి గౌరవమునందుట? ఏరికెట్టి సమర్థతయున్నదియుఁ దేలుచు నేయున్నది. మంజువాణి వెన్నంటి వెడలిన కవిరాజసందర్శనలాభముం బడయనివారెవరు? ఎవ్వఁడో నీవంటివాఁడు నూటికొక్కఁడుదక్క దక్కినవారందఱు నందియేయున్నారు. 'ఓహోయీ కవిరాజు లెవ్వరు? గద్వాలసంస్థానాస్థాన కవులగు ప్రభాకరాఖ్య వరులఁట. వీరికవితాసామర్థ్యమెట్టిదన' అనియేమేమో నీలోననీవే ప్రశ్న జేసికొని యాశ్చర్యపడఁజొచ్చితివి. 'వీరికవితాసామర్థ్యంబెట్టిదన' అని విమర్శింప మొదలు పెట్టితివి. చాలుచాలు. నీ తెలివికి ప్రభాకరకవిగారి కవిత్వమును విమర్శింపఁ దగినదే. తొందరపడక, ఆలించితివేని ముందుముందు నీ తెలివియుఁ గవిగారి తెలివితక్కువయు గానుపించును. ఇంతటికవికులాగ్రగణ్యుఁడేయే మహాకావ్యముల రచియించి వాసింగాంచెనో యింతవఱకుం దెలియరాకున్నది.' అని నోటికివచ్చినట్లెల్ల వ్రాయుటయే జయసాధనంబనుకొంటివి గాఁబోలును. వీరేమిచేసిరో నీకేమి తెలియును? వీరికవిత్వములోని మాటలే గ్రుడియకొకమారుగ మార్చి యర్థములేదనుకొని యెగిరిపడుచు నర్థము దెల్పుమను నర్థజ్ఞుఁడవు నీవు వీరుచేసిన గ్రంథములెట్లు తెలియును? సత్యప్రియుఁడా! వీరు కందరామాయణము మొదలయిన గ్రంథములనేకములు చేసియున్నారు. వినలేదు కాఁబోలు? వినియుఁ బొరపడియుందువు. కాదుకాదు. నీకంతటి లోకజ్ఞానము లేద

కావలయు. 'శ్రీమన్మంత్రిప్రగడ భుజంగరాయవిరచితమగు గానామృతమను నొక చిన్నపొత్తమును నిరుపయోగమయినద' ని వ్రాయుచున్నావు. నీవుచేసిన పెద్దపొత్తములయుపయోగమేమో, యీచిన్నిపొత్తముయొక్క నిరుపయోగమేమో తెల్లమగుచునేయున్నది. "గోరంతలు కొండంతలుచేసి వందిమాగధస్తవంబులు వినిపించుట స్వదేశసంస్థానాస్థానకవులకు నైసర్గికంబు గాఁబోలు" నంటివి. గోరంతలు కొండంతలుచేసి వందిమాగధస్తవంబులు వినిపించుట స్వదేశసంస్థానాస్థాన కవులకు నైసర్గికంబుగాదుగాని నీబోటియల్పసత్యప్రియులకు తప్పులేనిచో కొండంతలుచేసి మోసపోయి గాసినొందుట నైసర్గికమైయున్నమాట సత్యమని పలుమారు ఘోషించుచున్నాను. "జీర్ణకావ్యంబులు జీవింపఁజేయు చింతామణి వైజయంతి అముద్రితగ్రంథచింతామణిపత్రికల మర్దించు మంజువాణి మోహముగొలిపెఁగాఁబోలుననుట వెఱ్ఱికాదా? పత్రికలెన్నియున్న నంతమంచిదియేగదా. ఒకమంచికార్యమును జేయ బలువురు సహాయపడినంగాని కానేరదు. ఒకచెడ్డకార్యము నీవంటివాఁడొక్కడె నిముషంబున నెరవేర్చఁగలఁడుగదా. "ఎంతటిపత్రికాధిపతులకైనను, ఎంతటికవీశ్వరులకైనను, ఎంతటిరాజాధిరాజులకైనను, స్వోత్కర్షనుబ్రకటించుకొనుచు పరుల నిరపరాధుల నిరసించుట శ్రేయోదాయకము కాద" ని శ్రీరంగనీతులు చెప్పుచున్నావు. కాని యిందుపరులనిందించిన దెంతమాత్రమునులేదు. "దయ్యపుకంటికి వేలపుగింజపెద్ద" దనురీతిని నీకట్లుతోచెనేగాని వేఱుకాదు. ఏపత్రికాధిపతులు ఏకవీశ్వరులు, ఏరాజాధిరాజులు, స్వోత్కర్షనుబ్రకటించి పరులనిందించిరి? అట్లు స్వోత్కర్షనుబ్రకటించుకొని నిందపాలుగావలసినవాఁడవు నీవొకఁడవే. ఏమనిన నీవేమో పెద్దబుద్ధిమంతుఁడనని చెప్పుకొనుచు పదమున నర్థమేమియునులేదు. దీనికర్థమేమని చక్కనిపద్యములలోని పదార్థముల వెక్కిరింప మొదలుపెట్టుటచేనని. "భుజంగరావుగారు తమ్ము నరనాథమౌళి, భుజంగసార్వభౌముఁడు భుజంగాధీశుఁడు, భుజంగరాణ్మఘవుఁడు," అని ప్రభాకరకవి వర్ణించినందున దామును వారికి కవిసార్వభౌమత్వము నిప్పించిరని" వ్రాసితివి. తప్పక యీబిరుదులకు వీరేతగుదురు. మఱియుఁదగుదురు.. ముమ్మాటికిందగుదురు. నీవెంతకడుపుబ్బు వ్రాత వ్రాసినను నీబిరుదులలోనొక్కటియు నీకువచ్చునవిగావని నమ్మియుండుము. తమంతటఁదాము బిరుదములుపెట్టుకొనుట తగుసమర్థులకేయని తెలిసికొనుము. నీవంటివాఁడు పెట్టికొనిన నిలుచునా! లేనిపోనివ్రాఁతలనేల వ్రాసెదు? ఈబిరుదములు లోకమునకెన్నటికిఁ బరిహాసపాత్రములుకావుగాని, నీకుమాత్రము పరిహాసపాత్రములు కాకపోవు. సత్యాసత్యములు చదువరులకుగాక నీయట్టివానికిఁ దెలియునా? వీరికవిత్వము సరసముగానేయున్నదిగాని నీవనుకొనినట్లు విరసముగాలేదు. "తమ కవితామాధుర్యమును లోకమునకుఁ జవిజూపఁదలఁచినయెడల నేదైననొక మహాకావ్యమును రచియింపరాదా?" యని మఱలవారుచేసినకావ్యములకొఱకే పలవరించుచున్నావు. వెనుక నే తెల్పియుండుటచే తిరుగదెల్పుట యనవసరమని తలఁచి, నీకు జ్ఞాపకశక్తి తక్కువయగుటచే మరల "కందరామాయణమ్ము" మొదలైనగ్రంథములఁ జేసియున్నారని

చెప్పుచున్నాను. నీకు వేదముంజదువునిచ్ఛ యిప్పుడుపుట్టినందుకు సంతసింపవలసినదే. ఒకటవపాఠపుస్తకమువలె వేదముపుస్తకముఁజూచి నేర్చికొన యత్నించుచుంటివి కాఁబోలును? ఆహా! యేమి నీనేర్పరితనము.! వేదమును జదివినవారు పెక్కుచోట్లగలరు. వారొకడబ్బయినఁ గైకొనకయే చెప్పెదరు. ఎక్కడనుజెప్పువారు నీకులభించకపోయిన శ్రీరాజావారియొద్ద ఘనాంతస్వాధ్యాయులు పల్వురుకలరు. నీవువచ్చి వారిందర్శించి వేడుకొనెదేని నీకు వేదము జెప్పించెదరు. ఆలసింపకుము ఏండ్లుముదురుచున్నవి. స్మృతులకును, శాస్త్రములకును, కావ్యములకు నాటకములకు భేదముతెలియని నీవునొక విమర్శకుఁడవేనా?

"పుస్తకభాండాగారము లీయపూర్వ భుజంగ సార్వభౌముని పుస్తకభాండాగారముకన్న లక్షమడుంగులధికములైనవివేనవేలున్న" వంటివి. ఏమిలాభము.? ఎచ్చటనెన్నిభాండాగారములున్నను భాండాగారములయందే పుస్తకములు చెదపట్టుచున్నవిగాని, వానివాడుకలోనికిఁదెచ్చువారెన్నివేలుజగంబుననుండిరో చెప్పుము. "కవిసార్వభౌమునకుఁదెలియకుండుటయెంతసిగ్గులచేటు' అనివాకొంటివి అయ్యయో! ఇప్పుడు నీకీపదములయర్థము దెలియకపోవుటయెంతసిగ్గుచేటోగదా." ఆజమీందారువుదారుశూరుపరదార కుమారువిచార శేముషీ దూరుభుజంగరాజబహదూరు" నని భుజంగసార్వభౌములనువర్ణించిరిగాన, "పరదారకుమారు, విశేష శేముషీదూరు" అనుదానికినర్థము దెలిపినన్ను గృతార్థుఁజేయుమా యపూర్వకవిసార్వభౌముని వినయవిధేయుండనై వేడుకొనుచున్నాన"ని ప్రార్థించితివిగాన, జెప్పెదవినుము. పరదారకుమారు, అనఁగాఁబరకాంతలకు, కుమారునివంటివాఁడనియర్థము. "విశేష శేముషీ" యనినూతనసమాసము నొకదానింగల్పించి వెఱ్ఱివ్రాఁతలు వ్రాయుచున్నావు. అదినీకెట్లుసాధువు కాఁగలదు? గ్రంథమున "విచార శేముషీదూరు" అనియున్నది. దీనికర్థమేమనఁగా, విచారముతోఁ గూడుకొనినబుద్ధిగలవారికిదూరుఁడనియర్థము. వ్రాసినదేవ్రాయుచున్న వెఱ్ఱిప్రశ్నములకుజవాబిచ్చుటయనవసరమనితోఁచియునిఁకనైనముందిట్టి వ్రాఁతలవ్రాయకుండుటకును లోకమునకిట్టి సంగతులు తెలిసియుండుటకును వ్రాసియున్నాను. దీర్ఘాలోచనలేక యిచ్చవచ్చినట్లెల్ల ననుటయే మేలనుకొంటివిగాని మీదుమిక్కిలి గొంతుకపట్టుకొనునను సంగతిగ్రహించవైతివి. బాగుపడదలఁచితేని నాహితంబు లాలించి కినియక శాంతచిత్తుఁడవగుటతగు. కాకున్నన్ను గుబాటగు. అని.

ఆంధ్రభాషాభిమానులారా! ఈసత్యప్రియుఁడొక్కఁడెగాక శశిలేఖయను పత్రికయుఁ గువిమర్శకులలోనే పడెనుచూడుఁడు.

"గోదావరిజిల్లాఏలూరు వాస్తవ్యులగు శ్రీరాజామంత్రిప్రగడ భుజంగరావు బహద్దర్ జమీందారుగారు ప్రచురించుచుండుమంజువాణియను మాసపత్రిక రెండు సంపుటములును, రెండవదానితోఁబంపఁబడిన కవిరాజసందర్శనమునుమాకందిన" వని వ్రాయుచునవసరప్రసంగములోనికిఁదిగినది. ఆప్రసంగమెట్లున్నదో భాషాభిమానులగు చదువరులించుక పరిశీలించినఁదెల్లంబగు.

3-2

...ారణ్యనిర్మూలనకుఠారము.

మొదటిసంచికలోనునుముందుగ శ్రీవారుతమరాజభక్తిసూచకముగ "విక్టోరియాతారావళిని" ముద్రించిరి. ఈతారావళినివీరిదివఱకేముద్రించియుండుటచేతఁ బదంపడియీసంచికలో దీనిజొప్పించినదంత మంచికార్యముకాదు. చర్విత చర్వణముగనున్న" దనె. ఒకసారివేసినగ్రంథముమరల వేయరాదని యేశాస్త్రమున నున్నదో? రాజభక్తిసూచకమగు విక్టోరియాతారావళిని ముద్రించుటతప్పా? రసములలో శృంగారరసమె ముఖ్యమయినదని పలుచోట్ల జెప్పియుండ శశిలేఖకేల కిట్టినది కాకపోయెనో? శృంగారరసమునఁ జదువరులునీరసులగుచున్నారనునంత తేలికమాటమఱొండుగలదా? శృంగారరసమున చదువరులు నీరసులగుటలేదుగాని శశిలేఖయే పరపక్షమువహించి నీరసించుచుండుట సహజము. మఱియుఁ గాకమానిమూర్తికవి, అడిదముసూరకవి, కూచిమంచితిమ్మకవి, వడ్డాది సుబ్బారాయకవి, వ్రాసినకావ్యములు——మేలు, "హెచ్చుగ లభించదనుకొనుచున్నారము" ని నుడువుచున్నది. మంజువాణిలో బడుగ్రంథములిదివఱకెన్నఁడచ్చువడెను? బ్ర॥ గురుజాడ శ్రీరామమూర్తిగారి యప్పయ్యదీక్షితుల చారిత్రముంగూర్చివ్రాయుచు, 'నిరర్థకములయిన మతద్వేషములుగలుగునేమోయని భయపడుచున్న' దఁట. ఇదిమిగులనసాలోచ్యమగుమాట. ఇంకనునదవవిషమని వ్రాయుచు వైద్యశాస్త్రమునుగురించియు, వ్యవసాయమును గురించియుఁ జిత్రముగావ్రాసియున్నది. ఈవైద్యశాస్త్రిమెచ్చటినుండివచ్చెనోనాకేమియు దోచకున్నది. పాపముశశిలేఖ చెవినిబడినదియెల్లనమ్మి కంటఁజూచినట్లులనె తన యభిప్రాయమును వెడలగక్రెను. మంజువాణిలోనున్నది వైద్యశాస్త్రిమఁట! తాను చదివియున్నదిగాఁబోలును? లేకకవిరాజ సందర్శనమునఁ జూచియుండెనో? అయ్యయ్యో! మంజువాణిలోనిది వైద్యుతలోహశాస్త్రమని యెఱుఁగదు. మంజువాణింజదువునపుడు పడవెతకినట్లగాని సులోచనములజోడు కనుపించినదికాదఁట. అది వెతకిగాని యాసులోచనములతోఁ జూచినబాగుండును. వ్యవసాయముంగూర్చి చేసిచూపించుమనుచున్నది

ఏపనినైన నట్లె చేసి చూపించుమనుంగాఁబోలు! "తప్పులెన్నువారు తమ తప్పులెఱుఁగరు" అనునట్లు తానేమోగొప్పదానివలె మంజువాణికి లోపంబులఁజెప్పఁబూనె. ముందుతనలోని లోపంబుల దిద్దుకొనినఁగదా యొరుల దిద్దుకొనుఁడనిచెప్పుట. ఇట్టి కువిమర్శనములకుఁ బయలుదేరి పరిహాసమును బొందకుండుగాక యని పలుమఱు చెప్పుచు,

"తోఁరోచెత్తోపొడ్డిబాపిరిఒచ్చి। మోరో ఒచెత్తోకుసార్ధాపొడో"

అను సామ్యమునను సరించి వ్రాసెడివారి వ్రాతలకేమని సంతసింతునని విరమించుచున్నాను.

(సశేషము) కొత్తపల్లి సుందరరామయ్యగారు.

Printed at the Manjuvani Press Ellore.

END OF
TITLE